ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 03 సంచిక -91 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం14 ఏప్రిల్ 2026

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం

**న్యూఢిల్లీ,ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. ఈ సందర్భంగా అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.



## ఏపీలో పరిశ్రమల ఏర్పాటు

# మరింత సులభం

**బ్రిటీష్ కాలం నాటి చట్టాల రద్దుపై చంద్రబాబు కీలక ఆదేశాలు**

**పారిశ్రామిక అనుమతుల సరళీకరణపై కేంద్ర బృందంతో సీఎం చంద్రబాబు సమావేశం**

**బ్రిటీష్ కాలం నాటి చట్టాలను తొలగించి, నిబంధనలను సులభతరం చేయాలని ఆదేశం**

**మే చివరికల్లా డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యం**

**అఫిడవిట్ ఆధారంగా వ్యాపారం ప్రారంభించేలా సంస్కరణలకు శ్రీకారం**

**డి-రెగ్యులేషన్‌లో కేంద్రం కంటే ఏపీ మెరుగ్గా ఉందని కేంద్ర బృందం ప్రశంస**

**అమరావతి,ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ఊతమిచ్చేందుకు, పెట్టుబడులను ఆకర్షించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పరిశ్రమల ఏర్పాటు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు, నిబంధనలను సులభతరం చేసేందుకు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను తొలగించి, వ్యాపారవేత్తలకు అనుకూల వాతావరణం కల్పించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఆర్డినెన్స్‌లు జారీ చేసి అయినా సరే, సంస్కరణలను వేగంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. **మిగతా 2లో...**



## ఓటు కోసం బయోమెట్రిక్ ...



కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను ప్రవేశపెట్టాలని పిటిషన్

ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకారం

ప్రస్తుత ఎన్నికలకు అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టీకరణ

రానున్న కాలంలో జరిగే ఎన్నికల కోసం పరిశీలించాల్సి ఉందన్న సుప్రీంకోర్టు 2లో.

# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం



**హైబ్రీడ్ మోడల్ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపట్టాలి**

**33శాతం మహిళా రిజర్వేషను అమలు చేయాలి**

**నాడు బీజేపీ సహకరించకపోవడం వల్లే ఆ బిల్లు ఆమోదం పొందలేదు**

**2026 జనాభా లెక్కలు తేలిన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన**

**పన్నులు చెల్లించి, సలాం కొట్టేందుకు మేం వ్యతిరేకం**

**: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి**

**హైదరాబాద్‌ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు సంబంధించి ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను 50 శాతం పెంచి డీలిమిటేషన్ చేపట్టాలనే ప్రధాని మోడీ విధానం దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర విఘాతాన్ని కలిగిస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దేశానికే పెద్ద విపత్తులాంటిదని ఆయన హెచ్చరించారు. ఈ విధానంతో 542 ఉన్న సీట్లకు అదనంగా 270 సీట్లు పెరుగు తాయని తెలిపారు. వీటిని 2026 జనాభా లెక్కల ప్రకారం కాకుండా 2011 జనాభాల లెక్కల ప్రకారం **2లో...**

## 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

**లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు**

**: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు**



**హైదరాబాద్‌ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

అంగన్వాడీలకు సంబంధించిన మొబైల్ ఫోన్ల కొనుగోళ్ల విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టను దెబ్బతీసేలా బీఆర్ఎస్ పార్టీ వ్యవహరిస్తోందని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి 48 గంటల్లో తనకు క్షమాపణ చెప్పాలనీ, లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని **మిగతా 2లో...**



## వివేకా హత్య కేసులో సునీత పిటిషన్

**: కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి హైకోర్టు ఆదేశం**

**అమరావతి,ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో తదుపరి దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ ఆయన కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం నాడు విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై స్పందించేందుకు రెండు వారాల సమయం కావాలని సీబీఐ కోరగా, ఈ నెల 27వ తేదీలోపు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. **మిగతా 2లో...**

# హార్మోజ్ దిగ్బంధనం..!

**నౌకలను అడ్డుకుంటున్న అమెరికా బలగాలు**

**ఇది చట్ట విరుద్ధం : ఇరాన్**

**ఇటువైపు వస్తే నాశనమే : ట్రంప్**

**సంయమనం అవసరమన్న చైనా**

**వాషింగ్టన్, టెహరాన్ :ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి**

పశ్చిమాసియాలో తాజా పరిణామాలు మరోసారి ప్రపంచ దేశాలను వణికిస్తున్నాయి. ఎప్పుడేం జరుగుతుందో తెలియని అనిశ్చితి నెలకొంది. అమెరికా-ఇరాన్ చర్చలు విఫలం కావడం, మరోవైపు హోర్ముజ్‌ను ఎలాగైనా తమ అదుపులోకి తెచ్చుకుంటామని, అందుకోసం ఆ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ట్రంప్ అన్నంతపనిచేశారు. చర్చల ప్రక్రియకు ముందే హోర్ముజ్ జలసంధి వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్న అమెరికన్ బలగాలు ట్రంప్ ఆదేశాల మేరకు దిగ్బంధనానికి దిగాయి **మిగతా 2లో...**





2లో.

## భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

**21వ శతాబ్దంలోనే అతిపెద్ద నిర్ణయాల్లో ఒకదానిని భారత్ తీసుకోబోతోందన్న మోదీ**

**భారత ప్రజాస్వామ్యాన్ని మహిళలు బలోపేతం చేస్తారన్న మోదీ**

**సుదీర్ఘ కాలం తర్వాత ఈ బిల్లు వస్తోందన్న మోదీ**

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# హోర్మోజ్ దిగ్బంధనం ..!

**మొదటిపేజీ తరువాయి**

. . భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30గంటలకు ట్రంప్ పెట్టిన గడువు ముగిసింది. ఆ వెంటనే అమెరికన్ నౌకాదళం పెద్ద సంఖ్యలో రంగంకి దిగింది. ఇరాన్ పోర్టులకు వెళ్లి. వచ్చే అన్ని నౌకలను అడ్డుకోవడం ప్రారంభించింది. ఇరాన్‌తో సంబంధంలేని ఇతర దేశాల పోర్టుల్లోకి వెళ్లి వచ్చే నౌకలను ఆపబోమని, ఇరాన్ పోర్టు వైపు వెళ్లడానికి ప్రయత్నించినా, అక్కడ నుండి రావడానికి ప్రయత్నించినా అడ్డుకుంటామని అమెరికా నౌకాదళం ప్రకటించింది. ఈ చర్యను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ బలగాలు దీనిని చట్ట విరుద్ధమైన చర్యగా, సముద్రపు దొంగతనం కిందకు వస్తుందని ప్రకటించాయి. ఇలాగే కొనసాగితే తాము తీవ్రంగా ప్రతిఘటిస్తామని ప్రకటించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన పోస్టులో తాము అమలు చేస్తున్న దిగ్బంధనం వైపు ఇరాన్ నౌకలు, ఫాస్ట్ అటాక్ షిప్స్ వస్తే నాశనం చేస్తామని ప్రకటించారు. ఇరాన్‌కు చెందిన 158 నౌకలను అమెరికా దళాలు ఇప్పటికే ధ్వంసం చేశాయని పేర్కొన్నారు. మరోవైపు కాల్పుల విరమణ ఇంకా అమల్లో వుందని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సోమవారం ప్రకటించారు.

**చట్టవిరుద్ధ డిమాండ్ల మానుకుంటే చర్చలకు సిద్ధం : ఇరాన్**

తాజాగా రెండో దఫా చర్చలకు తాము సిద్ధంగానే వున్నామని ఇరాన్ ప్రకటించింది. అమెరికా చట్టవిరుద్ధమైన డిమాండ్లు చేయరాదని, తాము చెప్పే షరతులను వినాలని అలా జరిగినపుడు చర్చలకు తాము సుముఖమేనని ఇరాన్ రాయబారి మహ్మద్ ఫతాలి తెలిపారు. ఇరాన్ శక్తి సామర్థ్యాలేమిటో అమెరికాకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. హోర్మూజ్ జలసంధి ఇరాన్ ప్రాదేశిక జలాల్లో వుందని, ఆ జలాలపై తమ హక్కును కాపాడుకుంటామని అన్నారు. శాంతి చర్చలకు ఇరాన్ కట్టుబడి వుందని, అదే సమయంలో అవసరమైతే సైనిక చర్యలకు కూడా సంసిద్ధంగా వున్నామని స్పష్టం చేశారు. అమెరికా, ఇరాన్ శాంతి చర్చలు జరపాలని, హోర్మూజ్‌ను తెరిచి పశ్చిమాసియా సంక్షోభాన్ని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని చైనా, రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్, ఆసియాన్ సహా పలు దేశాలు కోరుతున్నాయి. తాజా పరిణామాలతో మళ్ళీ చమురు ధరలు భగ్గుమన్నాయి. ట్రంప్ హెచ్చరికల నేపథ్యం లో బ్యారెల్ చమురు ధర వంద డాలర్లు దాటింది.

**సంయమనం పాటించాలి : చైనా**

అన్ని పక్షాలు సంయమనం పాటించాలని చైనా సోమవారం కోరింది. హోర్మూజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి గువో జియాకున్ స్పందిస్తూ, తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాలకు సంబంధిత పక్షాలన్నీ కట్టుబడి వుండాలని కోరారు. రాజకీయ, దౌత్య మార్గాల ద్వారా వివాదాలను పరిష్కరించుకోవడానికి నిబద్ధతతో వుండాలన్నారు. అవసరమైతే సంక్షోభాన్ని పరిష్కరించేందుకు చైనా సానుకూల, నిర్మాణాత్మక పాత్ర పోషించడానికి సిద్ధంగా వుందని ప్రకటించారు.

**ఇరాన్‌కు ఆయుధాలా? : నిరాధారమన్న చైనా**

ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తున్నామన్న వార్తలను నిరాధారమైనవిగా చైనా స్పష్టం చేసింది. అమెరికా నిఘా వర్గాలను ఉటంకిస్తూ పలు వార్తా సంస్థలు ఈ మేరకు కథనాలు అందించాయి. ఆ నేపథ్యంలో గువో జియాకున్ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, మిలటరీ ఉత్పత్తుల ఎగుమతి దిశగా చైనా ఎల్లప్పుడూ అత్యంత జాగరూకతతో, బాధ్యతా యుతమైన వైఖరిని అవలంబిస్తుందని చెప్పారు. తమ ఎగుమతి నియంత్రణా చట్టాలకు అనుగుణంగా, అంతర్జాతీయ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

పశ్చిమాసియాలో తాజా పరిణామాలను చైనా నాయకత్వంతో చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్ మంగళవారం బీజింగ్ వెళ్లనున్నారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్‌యి ఆహ్వానం మేరకే ఈ పర్యటన జరుగుతోంది.

**అంతర్జాతీయ మార్కెట్లపై ప్రభావం : రష్యా ఆందోళన**

హోర్మూజ్‌ను దిగ్బంధిస్తే అంతర్జాతీయ మార్కెట్లు దెబ్బతింటాయని రష్యా సోమవారం ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్ ఓడరేవులను, తీర ప్రాంతలను మొత్తంగా దిగ్బంధిస్తామని అమెరికా హెచ్చరించిన నేప థ్యంలో క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ స్పందిస్తూ, ఇలాంటి విపరీత చర్యలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని అన్నారు.

**ఏ ఒక్క దేశానికీ ఆ హక్కు లేదు**

హోర్మూజ్‌ను దిగ్బంధించే చట్టబద్ధమైన హక్కు ఏ దేశానికీ లేదని ఐక్యరాజ్య సమితి సముద్ర జలాల సంస్థ అధినేత ఆరెన్సియో డొమింగ్వెజ్ ఒక పత్రికా సమావేశంలో స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, అంతర్జాతీయ జలసంధుల ద్వారా ప్రయాణించే నౌకల రాకపోకలను అడ్డుకునే లేదా నిషేధించే హక్కు ఏ దేశానికీ లేదని, అవన్నీ అంతర్జాతీయ మార్గాలేనని చెప్పారు.

**ఇరాన్ నేవీ దిగ్బంధనానికి ఇజ్రాయిల్ మద్దతు**

ఇరాన్‌పై నేవీ దిగ్బంధన చర్యలు తీసుకోవాలన్న ట్రంప్ నిర్ణయాన్ని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు సమర్ధించారు. ఈ విషయంలో అమెరికాకు పూర్తిగా మద్దతిస్తామని చెప్పారు.

**దక్షిణ లెబనాన్‌లో కీలక పట్టణాన్ని చుట్టుముట్టిన బలగాలు**

దక్షిణ లెబనాన్‌లో కీలకమైన పట్టణాన్ని తమ బలగాలు చుట్టుముట్టాయని ఇజ్రాయిల్ మిలటరీ సోమవారం ప్రకటించింది. ఈ కీలక పట్టణం హిజ్బుల్లా మిలటరీ సదుపాయాల కేంద్రమని పేర్కొంది. వ్యూహాత్మకమైన బింట్ జిబెల్ పట్టణంలో భూతల సైనిక కార్యకలాపాలను ప్రారంభించామని తెలిపింది. గత వారం రోజుల్లో వంద మందికి పైగా హిజ్బుల్లా కార్యకర్తలను హతమార్చామని వెల్లడించింది. దక్షిణ లెబనాన్‌లో స్కూలు, ఆస్పత్రి, కీలక కూడలి సమీపంలో ఇజ్రాయిల్ బలగాలు మాటు వేసి వున్నాయని హిజ్బుల్లా పేర్కొంది.

# ఏపీలో పరిశ్రమల ఏర్పాటు మరింత సులభం

**మొదటిపేజీ తరువాయి**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డి-రెగ్యులేషన్ ఫేజ్-2 కార్యక్రమంపై చర్చించేందుకు కేంద్ర ఉక్కు శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని బృందం సోమవారం అమరావతిలో ముఖ్యమంత్రితో భేటీ అయింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌తో పాటు వలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**కేంద్ర బృందంతో సీఎం సమీక్ష.. మే నాటికి ఫేజ్-2 పూర్తి లక్ష్యం**

కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం, రాష్ట్రంలో డి-రెగ్యులేషన్ ఫేజ్-2 అమలుపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో విస్తృతంగా చర్చించింది. పరిశ్రమల ఏర్పాటులో వేగాన్ని పెంచడం, అనుమతులను సులభతరం చేయడం, అనవసర నిబంధనలను తొలగించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి సారించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను సందీప్ పౌండ్రిక్ సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న విధానాలను, భవిష్యత్ ప్రణాళికలను ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తెలియజేశారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-1లో భాగంగా 7 శాఖల్లో 23 ప్రాధాన్యత అంశాలను పూర్తి చేశామని, ఫేజ్-2లో 28 అంశాలను లక్ష్యంగా నిర్దేశించుకున్నామని అధికారులు వివరించారు. మొత్తం 47 సిఫార్సుల్లో ఇప్పటివరకు 18 అమలు కాగా, మే 31 నాటికి పూర్తి లక్ష్యాన్ని చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

**బ్రిటీష్ చట్టాల రద్దు.. అనుమతుల సరళీకరణపై కీలక ఆదేశాలు**

పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేసే ప్రక్రియలో ఉన్న జాప్యాన్ని, క్లిష్టతను పూర్తిగా తొలగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బ్రిటీష్ కాలం నాటి పాత చట్టాలను రద్దు చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం 800కు పైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు, లైసెన్సుల సంఖ్యను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని ఆదేశించారు. అయితే, ప్రజల భద్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కీలక అంశాల్లో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. అనవసర వేధింపులు తగ్గించేందుకు థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యం ఇవ్వాలని, డబుల్ లైసెన్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని సూచించారు.

వ్యాపార రిజిస్ట్రేషన్లకు జీవితకాల చెల్లుబాటు ఉండేలా వ్యవస్థను తీర్చిదిద్దాలని అన్నారు. ఫైర్ సేఫ్టీ విషయంలో నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థాయిలో రాష్ట్రానికి అనుకూలంగా ఉండే సరళమైన నిబంధనలు అమలు చేయాలని, ఫేజ్-2 అమలు తర్వాత పరిశ్రమల ఏర్పాటుకు పట్టే సమయం కనీసం 40 శాతం తగ్గాలని నిర్దేశించారు.

**ఒకే శాఖలో అనుమతుల విలీనం.. అవసరమైతే ఆర్డినెన్సులు**

డి-రెగ్యులేషన్ ఫేజ్-2ను వేగంగా అమలు చేయడానికి అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం ఉన్న 82 రకాల అనుమతులను దశలవారీగా 57కు తగ్గించాలని సూచించారు. బిల్డింగ్ ప్లాన్, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వంటి వాటికి సంబంధించిన 30 ప్రక్రియలను 18కి తగ్గించాలని చెప్పారు. ఒకే శాఖ పరిధిలోని పలు అనుమతులను విలీనం చేయడం, కొన్నింటికి అనుమతులు కాకుండా కేవలం ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు.

భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలకు కొనసాగింపుగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. అన్ని అనుమతులు ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అఫిడవిట్‌తో వ్యాపారం.. డిజిటలైజేషన్‌కు పెద్దపీట**

పెట్టుబడిదారులకు మరింత భరోసా కల్పించే దిశగా, అఫిడవిట్ ఆధారంగానే వ్యాపారం ప్రారంభించే అవకాశాన్ని కల్పించాలని ముఖ్యమంత్రి సూచించారు. నిర్దిష్ట కాలం పాటు తనిఖీలు తగ్గించడం వంటి సంస్కరణలతో అనుకూల వాతావరణం సృష్టించాలని అన్నారు. ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈ రంగం నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని ఆదేశించారు. దరఖాస్తు నుంచి అనుమతి వరకు మొత్తం ప్రక్రియను డిజిటలైజ్ చేయాలని, దీనివల్ల పారదర్శకత పెరుగుతుందని వివరించారు. మీ సేవా, సింగిల్ డెస్క్ పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ 'మన మిత్ర' వంటి వ్యవస్థల ద్వారా ప్రజలకు, వ్యాపారులకు సేవలను సులభతరం చేయాలని ఆదేశించారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో కూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

**ఏపీ పనితీరు అద్భుతం.. ఫేజ్-3లో ఏఐకి ప్రాధాన్యం**

డి-రెగ్యులేషన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చూపిస్తున్న చొరవను, పనితీరును కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ప్రశంసించారు. కేంద్రం ప్రతిపాదించిన అంశాల కంటే ఏపీ మెరుగ్గా పనిచేస్తోందని, నిర్దేశిత గడువులోగా ఫేజ్-2ను పూర్తి చేస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదంతో పనిచేస్తున్నామని, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి "స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" విధానానికి మారామని తెలిపారు. అటవీ చట్టాలను కూడా సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచించారు. డి-రెగ్యులేషన్ ఫేజ్-3లో టెక్నాలజీ, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇప్పటికే డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్ వంటి వ్యవస్థలను వినియోగిస్తున్నామని వారికి వివరించారు.

# భారతదేశం సరికొత్త చరిత్రను లిఖించనుంది

**: ప్రధాని నరేంద్రమోదీ**


న్యూఢిల్లీ, ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి

మరో నాలుగు రోజుల్లో మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజనపై పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ రాజధానిలో ఈ అంశంపై వేడి రగులుకుంది. 21వ శతాబ్దిలో భారత్ తీసుకుంటున్న అతి పెద్ద నిర్ణయం మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించడం అని ఇప్పటికే ప్రధాని మోదీ అభివర్ణించారు. ఈ శతాబ్ది నారీ శక్తికి అంకితమని ప్రకటించారు. సోమవారం విజ్ఞాన్ భవన్‌లో 5వేల మంది మహిళల సమక్షంలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయం ఇక నినాదంగా కాక పని సంస్కృతిలో భాగం కాబోతోందని ప్రకటించారు. 'నారీ శక్తి వందన చట్టం' గురించి ఉధృతంగా గ్రామగ్రామాల్లో సోషల్ మీడియాలో ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా మహిళలతో సదస్సులు నిర్వహించాలని బీజేపీ తన పార్టీ విభాగాలను ఆదేశించింది. వివిధ రాష్ట్రాల నుంచి ముఖ్యమైన మహిళా నేతలందర్నీ ఢిల్లీకి పిలిపించిన బీజేపీ ఈ వారం రోజులూ ఢిల్లీలోనే ఉండి పెద్ద సంఖ్యలో కార్యక్రమాలు చేపట్టాలని వారికి నిర్దేశించింది. మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ జరిగే సమయంలో మహిళలు స్వయంగా పెద్ద ఎత్తున పార్లమెంటుకు వచ్చి తిలకించేందుకు బీజేపీ ఏర్పాట్లు చేసింది.



**కాంగ్రెస్‌లో తర్జనభర్జన**

అయిదు రాష్ట్రాల ఎన్నికలయ్యేంత వరకు ఈ అంశంపై చర్చించడానికి తాము సిద్ధంగా లేమని కాంగ్రెస్ ప్రకటించినప్పటికీ మోదీ పట్టించుకోక పోవడంతో ప్రధాన ప్రతిపక్షంలో ఈ అంశంపై తర్జన భర్జనలు మొదలయ్యాయి. పార్లమెంట్‌లో అవలంబించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ నెల 15న ఇతర ప్రతిపక్షాలతో సమావేశం ఏర్పాటు చేసింది. మరోవైపు ఏప్రిల్ 16న ప్రారంభమై మూడు రోజుల పాటు జరిగే సమావేశాలకు పూర్తి సంఖ్యలో హాజరు కావాలని కాంగ్రెస్ ఎంపీలకు విప్ జారీ చేసింది. అత్యంత ముఖ్యమైన ఈ సమావేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోరాదని ఆదేశించింది. మహిళా రిజర్వేషన్‌కు, డీ లిమిటేషన్‌కు ముడిపెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రతిపక్షాలు కలిసివస్తే రాజ్యాంగ సవరణ బిల్లులను వ్యతిరేకించాలని భావిస్తోంది. లోక్‌సభ సీట్లను 543 నుంచి 816 సీట్లకు పెంచడం వల్ల దక్షిణాది రాష్ట్రాలతో పాటు చిన్న రాష్ట్రాలకు తీవ్ర నష్టం జరుగుతుందని ఇటీవల జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో తీర్మానించిన విషయం తెలిసిందే. నారీ శక్తి వందనా అధినియమ్(మహిళా బిల్లు) అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయమన్నా చేయకుండా మోదీ ఒంటెత్తు పోకడతో వ్యవహరిస్తున్నారంటూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ సోమవారం పత్రికలకు రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడానికి తాము వ్యతిరేకం కాదని, 2027 జనాభా లెక్కలకు ముందు డీలిమిటేషన్ ప్రక్రియను తాము వ్యతిరేకిస్తున్నామని సోనియాగాంధీ ఈ వ్యాసంలో పేర్కొన్నారు. ఏకపక్షంగా చేస్తున్న డీలిమిటేషన్ అత్యంత ప్రమాదకరమని, రాజ్యాంగం మీదే దాడి అని వ్యాఖ్యానించారు.



# మోడీ కుట్ర దేశానికే ప్రమాదం

**మొదటిపేజీ తరువాయి**

మోడీ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్రాల మధ్య వివక్ష, అంతరాలు పెరుగుతాయని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అనేవి ఒకటి కాదని స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని, వెంటనే ఆ బిల్లును ఆమోదించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు గతంలో బీజేపీ సహకరించకపోవడం వల్లే లోక్‌సభలో ఆగిపోయిందని విమర్శించారు. నియోజక వర్గాల పునర్విభజన, మహిళా బిల్లుపై కేంద్రం హడావుడిగా పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోడీ సర్కారు వ్యూహాత్మకంగా మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనను రెండింటినీ ఒకటిగా చూపించి ప్రతిపక్షాలు సహకరించడం లేదంటూ ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు అంశాలకు ఒకదాని కొకటి సంబంధం లేదని స్పష్టం చేశారు. రెండింటిని విడదీసి వేర్వేరుగా చర్చించి, వాటి అమలుపై విధివిధానాలు రూపొందించాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రధాని మోడీ ఇంతకాలం పట్టించుకోలేదని సీఎం విమర్శించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతునిచ్చిందని గుర్తు చేశారు. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చారని, అప్పుడు రాజ్యసభలో అది ఆమోదం పొందిందని తెలిపారు. అందులోనూ బీసీ కోటా ఉండాలనేది తమ పార్టీ నిర్ణయమని చెప్పారు. పురుషులతోపాటు మహిళలకూ ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. అప్పటికి ప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని, పురుషులతోపాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించామని గుర్తు చేశారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని అన్నారు. రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. 40 ఏండ్లలో బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిని ఒక్క మహిళకైనా ఇచ్చారా? అని ఆ పార్టీ నేతలను ప్రశ్నించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ దీనికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. 2026 జనాభా లెక్కల గెజిట్ ఆధారంగా మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తామంటూ బీజేపీ ప్రభుత్వం చట్టం చేసిందని సీఎం గుర్తు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 543 లోక్‌సభ సభ్యుల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తే, 181 మంది మహిళలు ఎన్నికయ్యేందుకు అవకాశం ఉండేదన్నారు. ఆ చట్టాన్ని లోక్‌సభలో ఆమోదించినప్పుడే అమలు కాకుండా బీజేపీ అడ్డుకుందని గుర్తు చేశారు. ఆ రకంగా మహిళలకు రిజర్వేషన్లను దూరం చేసిందని విమర్శించారు. 2026 జనాభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా చట్టాన్ని ముందుకు తెస్తున్నారని తెలిపారు. 2026 జనాభా లెక్కల ప్రకారమే నిబంధనలను సవరించుకుంటే, 2029 లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల అమలుకు అవకాశం ఉంటుందని సూచించారు. మహిళా రిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంలో బీజేపీ రాజకీయ కుట్ర దాగి ఉందన్నారు. నియోజకవర్గాల పునర్విభజనను ప్రధాని మోడీ రాజకీయ పావుగా, ప్రమాదకరంగా వాడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఓటు కోసం బయోమెట్రిక్ విధానం...

## కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి

భారతదేశ ఓటింగ్ ప్రక్రియలో ఐరిస్ బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్ విధానాలను ప్రవేశపెట్టాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ అమలు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలైంది. ఈ అభ్యర్థనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ఈరోజు అంగీకరించింది. ఇప్పటికే కేరళ, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఎన్నికలు పూర్తయ్యాయి. తమిళనాడులో ఏప్రిల్ 23న... పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న రెండు విడతల్లో ఓటింగ్ జరగనుంది. ఈ క్రమంలో ప్రస్తుత ఎన్నికలకు ఈ అభ్యర్థన పరిగణనలోకి తీసుకోలేమని స్పష్టం చేసింది.

రానున్న కాలంలో జరగబోయే అసెంబ్లీ, సార్వత్రిక ఎన్నికలకు బయోమెట్రిక్ విధానం అమలు చేయడాన్ని పరిశీలించాల్సి ఉందని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ అంశంపై స్పందించాలంటూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, కేంద్ర ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

# వివేకా హత్య కేసులో సునీత పిటిషన్

**మొదటిపేజీ తరువాయి**

వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు తీరుపై సునీత అసంతృప్తి వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దర్యాప్తు సంస్థ పలు అనుమానాస్పద, సందేహాస్పద అంశాలను విస్మరించిందని, కేసులో లోతైన విచారణ జరిపేలా సీబీఐని ఆదేశించాలని ఆమె తన పిటిషన్‌లో అభ్యర్థించారు.

సోమవారం ఈ పిటిషన్ విచారణకు రాగా, సీబీఐ తరపు న్యాయవాది వాదనలు వినిపించేందుకు గడువు కావాలని కోరారు. ఇందుకు అంగీకరించిన ధర్మాసనం, ఈ నెల 27లోపు కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ తదుపరి విచారణను అదే తేదీకి వాయిదా వేసింది.

సీబీఐ కౌంటర్ దాఖలు చేశాక, ఇరుపక్షాల వాదనలు విన్న తర్వాత తదుపరి దర్యాప్తుపై హైకోర్టు తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. దీంతో ఈ కేసులో న్యాయస్థానం ఎలాంటి ఆదేశాలు జారీ చేస్తుందనే దానిపై ఉత్కంఠ నెలకొంది.

# 48 గంటల్లో క్షమాపణ చెప్పాలి

**మొదటిపేజీ తరువాయి**

ఆమె హెచ్చరించారు. ఈ మేరకు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సీతక్క సోమవారం లీగల్ నోటీసులు పంపారు. మంత్రి తరపున అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్ట్ ద్వారా కేసీఆర్‌కు నోటీసు పంపారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ (టీజీటీఎస్) నిర్వహించిందని నోటీసులో సీతక్క పేర్కొన్నారు. టెండర్ ఎవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ జరిగిందని గుర్తుచేశారు. ఇందులో తన ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మొత్తం టెండర్ విలువ రూ.44.42 కోట్లేనని గుర్తుచేశారు. అందులో రూ.30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇవి పూర్తిగా ఆధారాలు లేని ఆరోపణ అని కొట్టిపారేశారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో మొబైల్‌ను రూ.11,650కే కొనుగోలు చేశామని వివరించారు. ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా వాటిని కొనుగోలు చేశామని వివరించారు. బీఆర్ఎస్ తన అధికారిక సోషల్ మీడియా వేదికగా తనపై చేస్తున్న దుష్ప్రచారానికి పార్టీ అధినేతగా కేసీఆర్ బాధ్యత వహించాలని సీతక్క డిమాండ్ చేశారు. 48 గంటల్లో ఆయా సోషల్ మీడియాల్లో పోస్టులను తొలగించాలని డిమాండ్ చేశారు. లేదంటే కేసీఆర్ స్వయంగా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో కూడా తనపై ఇలాగే తప్పుడు ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా కేటీఆర్ ప్రశ్నలకు తాను గట్టిగా సమాధానం చెప్పిన తర్వాతనే తనపై ఇలాంటి దాడి మొదలైందని సీతక్క గుర్తుచేశారు.

# ఇకపై నిధి పోర్టల్ ద్వార ఆపెన్షన్ల పంపిణీ

## ఏపి ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి,ఏప్రిల్13ఆంధ్ర ప్రగతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ప్రతి దశలో ఉన్న అభ్యర్థనలు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగుల పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ ప్రతిపాదనను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం14 ఏప్రిల్ 2026


# వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు 100 శాతం పనులు కల్పించాలి

## నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలి.

### ..ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి. -.జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 13:** వీబీ జీ రామ్ జీ కింద కూలీలకు 100 శాతం పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఎంపిడిఓ లను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి పిజిఆర్ఎస్, హౌసింగ్, జలధార – జలహారతి, వీబీ జీ రామ్ జీ తదితర అంశాలపై జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీబీ జీ రామ్ జీ కి సంబంధించి కూలీలకు పనులు కల్పించడంలో పురోగతి తీసుకొని రావాలన్నారు. కూలీలకు పనులు కల్పించడంలో పత్తికొండ, హాలహర్వి, మద్దికెర లాంటి మండలాలు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకుంటున్నాయని, కోసిగి మండలం మాత్రం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోకపోవడం ఏంటని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. 3 రోజులలో కూలీలకు పనులు కల్పించడంలో పురోగతి తీసుకొని రాకపోతే తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కోసిగి ఎంపిడిఓ ను ఆదేశించారు. 140 గ్రామ పంచాయతీలలో నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్ ద్వారా కూలీల అటెండెన్స్ లేదని, 3 రోజుల తర్వాత కూడా ఇదే విధంగా ఉన్నట్లైతే ఫీల్డ్ అసిస్టెంట్ ల మీద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏ ఒక్క గ్రామ పంచాయతీ కూడా జీరో అటెండెన్స్ ఉండకూడదని కలెక్టర్ తెలిపారు. ఎండాకాలం కాబట్టి కూలీలు పని చేసే ప్రదేశంలో ఖచ్చితంగా షేడ్, నీళ్లు ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎక్కడ కూడా సదుపాయాలు లేవనే ఫిర్యాదులు రాకూడదన్నారు. కూలీలు పని చేసే సమయం ఉదయం 6 నుండి 10 గంటల వరకు పెట్టుకోవాలన్నారు. అదే విధంగా ఉదయం 6 గంటలకు కూలీలు పని చేసే ఫోటోలు, క్షేత్రస్థాయిలో ఫీల్డ్ ఆఫీసర్ లు, టెక్నికల్ ఆఫీసర్ లు హాజరు అవుతున్నారో లేదో కంట్రోల్ రూమ్ నుండి మానిటర్ చేసుకోవాలని కలెక్టర్ డ్వామా పిడి ని ఆదేశించారు. గత వారం రిపోర్ట్ చేసిన లేబర్ సంఖ్యకు మరియు జనరేట్ అయిన పర్సంటేజీకి మధ్య వ్యత్యాసం ఉందన్నారు. తప్పుడు లేబర్ రిపోర్టింగ్





చేయకుండా, ఎంతమంది పనికి వచ్చారో అంతమంది వివరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులకు త్వరలోనే ముఖ్యమంత్రి తో సమీక్ష ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గాల వారీగా ర్యాంకులు ఇస్తారన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు కేవలం వారి శాఖ పరమైన కార్యక్రమాలే కాకుండా, నియోజకవర్గంలోని అన్ని అభివృద్ధి పనులను పర్యవేక్షించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులందరూ తమ నియోజకవర్గాల బడ్జెట్, తలసరి ఆదాయం, మరియు అభివృద్ధి సూచికలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

జలధార – జలహారతి కార్యక్రమంలో భాగంగా మండలాల్లో ఉన్నటువంటి అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ని పనులు గుర్తించారు? ఆ పనుల వివరాలు ఏమిటి? ఒక్కవేళ సర్ ప్లస్ నీళ్లు (అదనపు నీరు) ఏవైనా ఉంటే, వాటిని వేరే వాటికి మళ్లించే పనులు ఏవైనా గుర్తించారా? అని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పంచాయతీల వారీగా ఈరోజు సాయంత్రం లోపు పనుల గుర్తింపు ప్రక్రియ పూర్తి చేసి రేపటి నుంచి పనులు మొదలుపెట్టాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ వారీగా ఏ చెరువు నుండి ఏ చెరువుకు నీరు వెళ్తుంది, చెక్ డ్యామ్‌లు మరియు అదనపు నీరు వెళ్లే మార్గాల వివరాలు, నీటి ప్రవాహ దిశను సూచించే బాణం గుర్తులు, క్యాచ్‌మెంట్ ఏరియా వివరాలు మ్యాప్‌లో ఉండే విధంగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. తాను గ్రామానికి వచ్చినప్పుడు ఎవరినీ అడగాల్సిన అవసరం లేకుండా, మ్యాప్ చూడగానే పనుల వివరాలు మరియు నీటి కనెక్టివిటీ అర్థం కావాలన్నారు.

హౌసింగ్ కి సంబంధించి ఉపాధి హామీ పథకం కింద పని దినాలు కల్పించడంలో పురోగతి తక్కువగా ఉందని, కౌతాళం మండలంలో పని దినాలు బాగా కల్పించారని, కోసిగి మండలం మాత్రం చాలా వెనుకబడి ఉన్నారన్నారు. సంబంధిత అంశంలో పురోగతి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆప్షన్3 కింద కాంట్రాక్టర్ లు నిర్మించిన ఇళ్లలో 2 వేల 522 ఇళ్లలో నిర్మాణ లోపాలను గుర్తించడం జరిగిందన్నారు. మిగిలిన వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కే పి ఐ సూచికలలో భాగంగా ఈ సంవత్సరానికి 9,430 ఇళ్ల లక్ష్యం నిర్దేశించబడిందన్నారు. మొదటి త్రైమాసికంలో 2,350 ఇళ్లను పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. ప్రణాళిక ప్రకారంగా రూఫ్ లెవెల్ లో ఉన్న వాటిని మొదటిగా పూర్తి చేసి, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా మిగిలిన ఇళ్లను కూడా రూఫ్ లెవెల్ కి తీసుకొని వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హౌసింగ్ ఇంజినీర్ లను ఆదేశించారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, హౌసింగ్ పిడి చిరంజీవి, డ్వామా పిడి నరసింహా రెడ్డి, డీఆర్డీఏ పిడి రమణారెడ్డి, పిజిఆర్ ఎస్ నోడల్ అధికారి దీప్తి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

**ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి.**

**జలధారజలహారతి వంద రోజుల ప్రణాళిక నివేదికలను వెంటనే అందించాలి.**

**ఆంధ్ర ప్రగతి జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి:** ఏప్రిల్ 13:అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు.

సమీక్షలో భాగంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిటిషనర్లకు ఇచ్చే ఎండార్స్‌మెంట్ ను స్పష్టంగా ఇవ్వడం ఇవ్వాలని, ఒక వేళ సమస్య పరిష్కరించ లేకపోతే ఎందువల్ల సమస్యను పరిష్కరించలేకపోతున్నామో, పిటిషనర్లకు బాగా అర్థమయ్యేలా వివరించాలన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని, గడువు ముగిసే వరకు చూడకుండా, ఆఖరి రోజు దరఖాస్తులను చూసి హడావుడిగా పరిష్కరిస్తే నాణ్యత ఉండదన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే పిటిషనర్లతో మాట్లాడాలన్నారు. రీఓపెన్, ఇంప్రాపర్





రెడ్రెసల్ శాతాన్ని పూర్తిగా తగ్గించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నామని, నిర్మాణాలను వేగవంతం చేసే దిశగా ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జలధారజలహారతి కార్యక్రమంలో భాగంగా అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళికకు సంబంధించి గ్రామ పంచాయతీ వారీగా పనులను గుర్తించి మ్యాపులతో సహా వెంటనే నివేదికలను అందించాలని జిల్లా కలెక్టర్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ అంశానికి సంబంధించిన శాఖలు సమన్వయంతో పనిచేసి, జిల్లాలో నీటి భద్రత, నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు కృషిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు తమ కార్యక్రమాలకు సంబంధించి ఆన్‌లైన్ డేటాతో పాటు శాఖల పనితీరులో ఎక్కడ బలంగా ఉన్నారు, ఎక్కడ బలహీనతలు ఉన్నాయో, ఇంకా ఎక్కడ దృష్టి పెట్టాలో స్పష్టంగా తెలియచేసేలా విశ్లేషణ నివేదికలను శుక్రవారం సాయంత్రం లోపు అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఏప్రిల్ 14 వ తేదీన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. అధికారిక కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ను పాటించాలని, ప్రోటోకాల్ అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్వో, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, డిఆర్డిఏ పిడి రమణారెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు జవాబుదారీగా పనిచేయండి

**..100% ఫిర్యాదుల పరిష్కారం తప్పనిసరి.**

**..విధుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు.**

**..గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం - సచివాలయ సిబ్బందికి దిశానిర్దేశం.**

**..సర్ప్రైజ్ ఇన్స్పెక్షన్లు, షోకాజ్ నోటీసులు - పనితీరుపై కఠిన నిఘా.**

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 13:** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి జవాబుదారీగా పనిచేస్తూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ముందు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గతంలో పరిష్కరించిన కొన్ని గ్రీవెన్సులు మళ్లీ రీఓపెన్ అవుతున్నాయని, అలాంటి కేసులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని సూచించారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖలకు సంబంధించిన 17 మంది అధికారులతో తాను సమీక్షిస్తానని తప్పనిసరిగా సంబంధిత పత్రాలతో హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత కోసం అధికారుల సమక్షంలోనే ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి,



వారి అభిప్రాయాలను నమోదు చేసి సీఎం కార్యాలయానికి నివేదిక పంపుతామని తెలిపారు. ప్రతి వారం జరిగే సమీక్షలకు ముందు 100 శాతం ఫిర్యాదుల పరిష్కారం జరగాలని, లేనిపక్షంలో సంబంధిత అధికారులపై చర్యలు తప్పవన్నారు. పీజీఆర్ఎస్ నివేదికలపై ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత వివరాలను నిర్దేశిత సమయంలో గా సమర్పించాలన్నారు. ఫిర్యాదుదారులకు ఎండార్స్‌మెంట్ ఇవ్వడం లేదా వారి వద్దకు వెళ్లి పరిష్కారం నమోదు చేయడం తప్పనిసరి అని తెలిపారు. డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి కార్యక్రమాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, ప్రభుత్వ కార్యక్రమాల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా ఐగాట్ "4-అవర్ లెర్నింగ్" కార్యక్రమాన్ని పూర్తి చేసి వెంటనే సర్టిఫికెట్లు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారుల హాజరు, పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ ఆదేశాల పట్ల నిర్లక్ష్యం సహించబోమని సూచించారు. పనితీరు ఆధారంగా మార్కులు ప్రకటిస్తామని తెలిపారు. అలాగే, కేపీఐల నమోదు, శిక్షణా కార్యక్రమాలు, సర్ప్రైజ్ తనిఖీలు, షోకాజ్ నోటీసుల జారీ వంటి అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. సెన్సస్ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఇటీవల బేతంచెర్ల మండలంలోని ఆర్. కృష్ణాపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించిన సందర్భంగా ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నట్లు తెలిపారు. కొన్ని శాఖల సిబ్బంది పనితీరుపై అసంతృప్తి వ్యక్తమవుతుండటంపై స్పందిస్తూ, బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని, హాజరు కాని వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్త బురుజు గ్రామ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, జల్ జీవన్ మిషన్ కింద తాగునీటి కనెక్షన్లు, మరుగుదొడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల పనులను వేగవంతం పూర్తి చేయాలని సూచించారు. విద్యుత్ సదుపాయాల కల్పనలో జరుగుతున్న ఆలస్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, సంబంధిత శాఖలు సమన్వయంతో పని పెంచాలని ఆదేశించారు. ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ డేకు వందల సంఖ్యలో ప్రజలు వస్తున్నందున, క్షేత్రస్థాయిలోనే సమస్యలను పరిష్కరించాలని, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.

అంతేకాకుండా, జలధారజలహారతి కార్యక్రమాలపై నిరంతర సమీక్ష ఉంటుందని, కె.సి కాలువ మరియు తెలుగు గంగ పనులను వేగవంతం చేయాలని, అవసరమైతే ఇతర పథకాల కింద కూడా పనులు చేపట్టాలని సూచించారు.

# సకాలంలో అంగన్వాడి కేంద్రాలకు బియ్యం పంపిణీ చేయాలి

### ..జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్.



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 13:** జిల్లాలోని అన్ని అంగన్వాడి కేంద్రాలకు బియ్యం సరఫరా సకాలంలో, నాణ్యతతో జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కర్నూలు నగరంలోని సివిల్ సప్లై బఫర్ గోదాంను ఆయన సందర్శించి, ప్యాకింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అంగన్వాడి కేంద్రాలకు పంపిణీ చేయబడుతున్న 3 కిలోల మరియు 25 కిలోల బియ్యం ప్యాకెట్ల తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్యాకింగ్ విధానం, నాణ్యత ప్రమాణాలు, సరఫరా వ్యవస్థపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని 1886 అంగన్వాడి కేంద్రాలకు ప్రతి నెల సరఫరా జరిగే బియ్యం ప్యాకెట్ల తయారీ మరియు పంపిణీలో ఎలాంటి ఆలస్యం లేకుండా సమయపాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ లోపు ప్యాకెట్ల తయారీ పూర్తి చేసి, వెంటనే పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులతో, ప్యాకింగ్ నాణ్యత, తూకం సరైన విధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ప్యాకింగ్ ఏజెన్సీ ను ఆదేశించారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత, సమర్థత పెంపొందించడంతో పాటు, ఎటువంటి లోపాలు చోటు చేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలకు సమయానికి సరఫరా జరిగితేనే గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులకు సరైన పోషకాహారం అందుతుందని పేర్కొంటూ, ఈ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై డీ.ఎం ఎన్. వెంకట రాముడు, సంబంధిత సిబ్బంది మరియు ప్యాకింగ్ ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు నారీ శక్తి వందన్ సమ్మేళనం.

### ఆదోని వన్ స్టాప్ సెంటర్ కు సిబ్బంది నియామకం. -..జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి:



**ఆంధ్ర ప్రగతి కర్నూలు, ఏప్రిల్ 13:** మహిళా సాధికారత, అభివృద్ధిని ప్రోత్సహించడం నారీ శక్తి వందన్ సమ్మేళనం ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.

సోమవారం విజ్ఞాన్ భవన్, ఢిల్లీ నుండి నిర్వహిస్తున్న నారీ శక్తి వందన్ సమ్మేళనం కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దేశ వ్యాప్తంగా మహిళలకు సందేశం ఇస్తున్న సందర్భంగా ఈ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళలు వీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మహిళా నాయకత్వాన్ని పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆదోని వన్ స్టాప్ సెంటర్ లో వివిధ ఉద్యోగాల కోసం ఎంపికైన 12 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అందజేశారు. మహిళలపై హింసకు గురైన వారికి సమగ్ర సేవలు అందించేందుకు ఈ నియామకాలు ముఖ్యమని, ఎంపికైన సిబ్బంది వైద్య సేవలు, న్యాయ సహాయం, మానసిక కౌన్సిలింగ్, తాత్కాలిక ఆశ్రయం వంటి సేవలను బాధిత మహిళలకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు..వన్ స్టాప్ సెంటర్ లక్ష్యాలను సాధించడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని, తమ విధులను నిబద్ధతతో, కరుణతో, వృత్తి నైపుణ్యంతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, సిడిపిఓలు , సూపర్వైజర్లు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి.




**ఆంధ్ర ప్రగతి కర్నూలు,ఏప్రిల్ 13:** జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకొని వారికి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ. సిరి పేర్కొన్నారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం అనంతరం నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎ.సిరి, జాయింట్ కలెక్టర్ నూరల్ ఖమర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... నైపుణ్యాభివృద్ధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళాలో భాగంగా వివిధ రకాలైన 11ప్రైవేటు కంపెనీలలో ఉన్న 650 ఖాళీలను భర్తీ నిమిత్తం ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎమ్మిగనూరు లో ఏప్రిల్ 21వ తేది, ఉ.9:30 గం.ల నుండి సా.4గం.ల వరకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. సదరు జాబ్ మేళా లో పాల్గొనాలనుకునే యువతీ, యువకులు 18 సం.ల నుండి 35 సం.ల లోపు ఉండడంతో పాటు పదవ తరగతి నుండి డిగ్రీ, ఐటిఐ, డిప్లొమా, పిజి చదివిన వారు జాబ్ మేళాలో పాల్గొని ఉపాధి పొందే అవకాశం ఉంటుందన్నారు. అందుకు గాను ముందుగా **Naipunyam.ap.gov.in** లింక్ లో సదరు వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారిణి దీప్తి మాట్లాడుతూ... జాబ్ మేళాను యువత పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. జాబ్ మేళాలకు సంబంధించి ఎటువంటి సందేహాలు ఉన్న నంబర్లకు సంప్రదించగలరని తెలిపారు.7799494856, 9642735717కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (ఇంచార్జి) చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, డి.ఆర్.డి.ఏ రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన బి శ్రీ భారతి.


### -.గడివేముల శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల విద్యార్థిని బి శ్రీ భారతి.

**ఆంధ్ర ప్రగతి గడివేముల ఏప్రిల్ 13:** నంద్యాల జిల్లా గడివేముల ఈనాడు రిపోర్టర్ బి శ్యాంసుందర్ రెడ్డి కుమార్తె బి శ్రీ భారతి గడివేముల శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల నందు నర్సరీ నుండి పదవ తరగతి వరకు చదివి గత సంవత్సరం 10వ తరగతిలో 600కు గాను 587 మార్కు సాధించి గడివేముల మండల టాపర్గా నిలిచారు. ఈరోజు ఇంటర్ మొదటి సంవత్సరం వెలువడిన ఫలితాలలో తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ అ యాతి కాలేజీ నందు ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎం.పీ.సీ గ్రూపులో 470 మార్కులకు గాను 468 మార్కు సాధించి తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ రెండవ ర్యాంకు సాధించారు. తెలంగాణ రాష్ట్రంలో స్టేట్ రెండవ ర్యాంకు సాధించిన బి శ్రీ భారతి నీ శ్రీ రాజరాజేశ్వరి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఎం రామేశ్వరరావు, మరియు పాఠశాల ఏవో ఎం రాఘవేంద్రరావు మరియు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.



# ఇంటర్‌లో కొణిదల ముని ప్రణవ్ రాయ్ ప్రభంజనం

**995 మార్కులతో నారాయణ కాలేజీలో టాపర్‌గా నిలిచిన ముని ప్రణవ్ రాయ్.**



**ఆంధ్ర ప్రగతి హైదరాబాద్, ఏప్రిల్ 13:**
తెలంగాణ ఇంటర్మీడియట్ ఫలితాల్లో కొణిదల ముని ప్రణవ్ రాయ్ సంచలన విజయాన్ని నమోదు చేశాడు. అసాధారణ ప్రతిభతో మెరిసిన ఈ విద్యార్థి మొత్తం 1000 మార్కులకు గాను 995 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిచి తండ్రికి తగ్గ తనయుడిగా పేరు తెచ్చుకున్నాడు. హైదరాబాద్‌లోని నారాయణ కాలేజీలో విద్యాభ్యాసం సాగించిన ప్రణవ్ రాయ్, మొదటి నుంచీ క్రమశిక్షణ, అంకితభావంతో చదువుపై దృష్టి సారించి ఈ ఘనత సాధించాడు. తన విజయానికి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాటు అధ్యాపకుల మార్గదర్శకమే ప్రధాన కారణమని ప్రణవ్ ఈ సందర్భంగా పేర్కొన్నాడు. పక్కా ప్రణాళికతో చదివితే ఏదైనా సాధించవచ్చని ఈ ఫలితాల ద్వారా నిరూపించాడు. ప్రణవ్ సాధించిన ఈ అద్భుత ఘనతపై ముఖ్యమంత్రి కార్యాలయ ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ప్రణవ్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పలువురు ప్రముఖులు ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కొణిదల సునీల్ కుమారుడి ప్రతిభపై సామాజిక మాధ్యమాల్లోనూ ప్రశంసల వెల్లువ కురుస్తోంది.

# ఆసుపత్రి భద్రత, పారిశుద్ధ్యం, వైద్య సేవల మెరుగుదలపై దృష్టి సారించండి.

**..హాస్పిటల్ పరిసరాల్లో సీసీటీవీ, ప్రహరీ గోడ ఏర్పాటు చేయండి.**

**..పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి.**

**..దాతల సహకారంతో ఆసుపత్రి అభివృద్ధి మౌలిక సదుపాయాల బలోపేతానికి ప్రాధాన్యం.**

**..జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 13:**
ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు, ఆసుపత్రి పరిసరాల్లో భద్రతా మరియు పారిశుధ్య పరిస్థితులను మరింత బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఛాంబర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పన మెరుగల వైద్య సేవలు అందించేందుకు పరికరాలు సంబంధిత అంశాలపై వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిజిహెచ్ సూపరింటెండెంట్ డా.జిలానీ, డిసిహెచ్ఎస్ డా.ఓ.లలిత, డిఎంహెచ్ఓ డా.వెంకటరమణ, ఏపీఎంఎస్ఐడిసి ఇంజనీర్లు నరసింహారెడ్డి జయరాంరెడ్డి, ఎడి మస్తాన్, డ్రగ్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. హాస్పిటల్‌లో ఉన్న ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు మరియు ఎయిర్ కండీషనర్లను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సిఎస్ఆర్ నిధుల కింద ఎన్ని పరికరాలను మరమ్మతు చేయించవచ్చో, అలాగే జిల్లా ఖనిజ నిధి ద్వారా ఎన్ని రిపేర్ చేయించవచ్చో పరిశీలించాలని జిజిహెచ్ సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఏసీల వార్షిక నిర్వహణ ఒప్పందం (ఆవీజ) విలువ రు.4.5 లక్షలు కాగా, గత ఏడాది సుమారు రు.10 లక్షలు ఖర్చు చేసినట్లు అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి వెనుక భాగంలో ప్రహరీ గోడ నిర్మించి, బలమైన గేటును ఏర్పాటు చేయాలని సూచించారు. అదనంగా భద్రత దృష్ట్యా సీసీటీవీ కెమెరాను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో వీధి కుక్కల సమస్యపై చర్చిస్తూ, వాటిని పట్టుకుని స్టెరిలైజేషన్ చేసి, నిబంధనల ప్రకారం తిరిగి అదే ప్రదేశంలో వదిలివేయాలని తెలిపారు. బయటి వ్యక్తులు ఆసుపత్రిలోకి వచ్చి అనధికారికంగా ఉండడాన్ని సెక్యూరిటీ సిబ్బంది కఠినంగా నిరోధించాలని స్పష్టం చేశారు. వైద్య సేవల పరంగా, మందుల కొనుగోలు ప్రక్రియ సెంట్రల్ ఆఫీస్ అనుమతులతో ఆన్‌లైన్ ద్వారా జరుగుతోందని వివరించారు. నెఫ్రోప్లస్ విభాగంలో వైద్యుల హాజరు సమస్యపై వచ్చే సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత వైద్యులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆదేశించారు. ఇతర మౌలిక సదుపాయాల విషయానికి వస్తే, ప్రహరీ గోడ నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు వ్యయం అవుతుందని అంచనా వేశారు. నిధుల కొరత దృష్ట్యా తాత్కాలికంగా ఇనుప గ్రిల్స్‌కు గ్రీన్ షీట్ ఏర్పాటు చేయాలని సూచించారు. రు. 6.5 లక్షల వ్యయంతో నిర్మాణంలో ఉన్న నీటి సంపు పనులు మరో 10 రోజుల్లో పూర్తవుతాయని, అనంతరం సంబంధిత అధికారులు కలెక్టర్ కు నివేదించారు. ఆసుపత్రి సేవల్లో నిర్లక్ష్యం కనబరిస్తే సంబంధిత విభాగాధిపతులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సేవల నాణ్యతపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తానని తెలిపారు.

# పోషణ పక్షోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 13:**
పోషణ పక్షోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్యం, పోషణపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పోషణ పక్షోత్సవాలకు సంబంధించిన గోడప్రచార పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి దేవి, డిఆర్ఓ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఏప్రిల్ 9 నుండి 23 వరకు పోషణ పక్షోత్సవాలను "క్యాంపెయిన్ మోడ్"లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ, డీఆర్డీఏ, మెప్మా, పాఠశాల విద్యాశాఖ, పంచాయతీరాజ్ తదితర శాఖలు భాగస్వాములుగా పనిచేస్తున్నాయని చెప్పారు. సమాజంలో మారుతున్న తరాలైన జనరేషన్ జెడ్, జనరేషన్ ఆల్ఫా, జనరేషన్ బీటా పిల్లల ఆరోగ్యం, పోషణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

**జంక్ ఫుడ్ ప్రభావం**

ప్రస్తుతం పిల్లలు బింగో, లేస్, కుర్కురే వంటి ప్యాకేజ్డ్ జంక్ ఫుడ్స్‌కు అలవాటు పడుతున్నారని, వీటిలో సోడియం నైట్రేట్, సోడియం బెంజోయేట్ వంటి హానికర రసాయనాలు అధికంగా ఉండటం వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతోందని హెచ్చరించారు. వీటి వినియోగం వల్ల చిన్న వయసులోనే రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, రోగనిరోధక శక్తి తగ్గిపోతుందని తెలిపారు.

**స్క్రీన్ టైమ్ ప్రభావం**

పిల్లల మెదడు అభివృద్ధిలో గర్భధారణ నుండి రెండు సంవత్సరాల వరకు ఉండే మొదటి 1000 రోజులు అత్యంత కీలకమని, ఈ సమయంలోనే 80 శాతం మెదడు అభివృద్ధి జరుగుతుందని, మిగిలిన అభివృద్ధి ఐదేళ్ల వయస్సు వరకు కొనసాగుతుందని వివరించారు. ఈ దశలో గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మరియు చిన్నపిల్లలు అధికంగా మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వల్ల పిల్లల్లో మాటల ఆలస్యం, భావోద్వేగ సమస్యలు, ప్రవర్తనా మార్పులు, ఆటిజం లక్షణాలు కనిపించే అవకాశముందని తెలిపారు. కాబట్టి గర్భిణీలు, పాలిచ్చే తల్లులు మొబైల్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అధిక స్క్రీన్ టైమ్ వల్ల కంటి సమస్యలు కూడా పెరుగుతున్నాయని అన్నారు.

**కథల ప్రాముఖ్యత**

పిల్లల సమగ్ర అభివృద్ధిలో కథల పాత్ర ఎంతో ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. పెద్దలు కథలు చెప్పడం ద్వారా పిల్లల్లో నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసం, భాషా పటిమ మరియు సృజనాత్మకత పెరుగుతాయని చెప్పారు. అంతకుముందు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ లీలావతి దేవి మాట్లాడుతూ, పిల్లలను ఆరోగ్యంగా పెంచేందుకు జంక్ ఫుడ్‌కు బదులుగా ఇంట్లో తయారుచేసిన పౌష్టికాహారం ఇవ్వాలని సూచించారు. అలాగే మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి, కథలు చెప్పే పాత సంప్రదాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్ల ద్వారా ఈ అవగాహనను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్, 13:**
యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే అంశాల్లో పెండింగ్ ఉన్న అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాలులో "స్వర్ణ గ్రామం – స్వర్ణ వార్డ్" పై సంబంధిత అధికారులను కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో డిఎల్డిఓ శివారెడ్డి, డ్వామా పిడి సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి యునిఫైడ్ ఫ్యామిలీ సర్వేలో మిగిలిపోయిన వివరాలైన విద్యార్హతలు, మొబైల్ నెంబర్లు, నైపుణ్య శిక్షణ మరియు అనుభవం వంటి వివరాలను సేకరించి, మూడు నాలుగు రోజులలోపు గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ–కేవైసి కి సంబంధించి దాదాపు 70 వేల మంది పెన్షనర్లకు ఆధార్ మరియు మొబైల్ నంబర్ **Authentication** ద్వారా తంబ్ ఇంప్రెషన్ లేదా ఓటీపీ ఉపయోగించి ఈ–కేవైసి ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థుల బయోమెట్రిక్ కు సంబంధించి 5 నుంచి 15 ఏళ్ల లోపు వయసున్న వారు సుమారు 56 వేల మంది విద్యార్థులకు మ్యాన్డేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తి చేయాలని తెలిపారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ అవసరమైన సేవలను అందించాలన్నారు. ప్రజల్లో సచివాలయ సేవలపై సానుకూల దృక్పథం 90% కంటే ఎక్కువగా ఉండాలని, ప్రస్తుతం ఇది 70% మాత్రమే ఉన్నందున, తక్కువ రేటింగ్ ఉన్న సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరుగుతుందన్నారు. జలధార పథకానికి సంబంధించిన పనులన్నింటినీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, ఈ ప్రక్రియను ఇరిగేషన్ శాఖ, గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ మరియు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది సమన్వయంతో ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆవుల మృతి - రైతుకు రూ.1 లక్ష సహాయం.

**..బాధిత రైతుకు అండగా జిల్లా యంత్రాంగం - కలెక్టర్ చేతుల మీదుగా నష్టపరిహారం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 13:**
రుద్రవరం మండలం భూమనాయుడుపల్లి గ్రామానికి చెందిన రైతు సుధాకర్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు ఆవులను కోల్పోయినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా, సంబంధిత రైతుకు నష్టపరిహారం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లోపం కారణంగా సుధాకర్ తన జీవనోపాధికి ఆధారమైన రెండు ఆవులను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. సాధారణంగా వర్షాలు, వరదలు వంటి ప్రకృతి విపత్తుల సందర్భంలోనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం నష్టపరిహారం వర్తిస్తుందని, ఈ ఘటనలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నేరుగా సహాయం అందించే అవకాశం లేదని తెలిపారు. అయితే, రైతు ఎదుర్కొన్న కష్టాన్ని పరిగణనలోకి తీసుకుని, పశు సంవర్ధక శాఖ నివేదిక ఆధారంగా జిల్లా యంత్రాంగం తరపున రూ.1 లక్ష ఆర్థిక సహాయం అందజేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకుని తిరిగి జీవనోపాధిని సాధించుకోవాలని రైతుకు సూచించారు.


# క్లియర్ వ్యూ లాసిక్ నేత్ర చికిత్సా కేంద్రం ప్రారంభించిన మంత్రి ఫరూక్

**..ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్లియర్ వ్యూ లాసిక్ సెంటర్.**

**..నంద్యాల వైద్య కేంద్రంగా రూపొందింది: మంత్రి ఫరూక్.**













**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
పద్మావతి నగర్ మెయిన్ రోడ్డు లో ఉన్న మాతృత్వ ఫెర్టిలిటీ సెంటర్ పై అంతస్తులో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ విజయ భాస్కర రెడ్డి ఏర్పాటు చేసిన క్లియర్ వ్యూ లాసిక్ సెంటర్ ను సోమవారం రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు ఎన్ఎండి ఫరూక్ ప్రారంభించారు. కేంద్రంలోని వివిధ విభాగాలను ఐఎంఏ జాతీయ కేంద్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రోటరీ మాజీ గవర్నర్ కల్లూరు రామలింగారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ అనిల్ కుమార్ లు ప్రారంభించారు.
ఈ సందర్భంగా డాక్టర్ విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ కంటి అద్దాల అవసరం లేకుండా కంటిలో చేసే చికిత్స కోసం అత్యాధునిక లేజర్ లాసిక్ సెంటర్ ను నంద్యాలలో ఏర్పాటు చేశామని, నంద్యాలలో ఉన్న నేత్ర వైద్యులు అందరూ ఈ కేంద్రంలో కంటి అద్దాలు అవసరంలేని చికిత్సలు చేసుకోవచ్చని అన్నారు. రాయలసీమలో ఇది అత్యాధునిక రెండవ కేంద్రమని,రాష్ట్రం ఈ స్థాయి కేంద్రాలు నాలుగు మాత్రమే ఉన్నాయి అని తెలిపారు. ఈ అవకాశాన్ని నంద్యాల, కర్నూలు జిల్లాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో కంటి అద్దాలు అవసరం లేని చికిత్స కోసం కోట్లాది రూపాయల విలువ చేసే పరికరాలతో అత్యాధునిక కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ రంగంలో ఇటు ప్రైవేటు రంగంలో వైద్య కళాశాల ఆసుపత్రులు ప్రైవేటు ఆసుపత్రులలో నిష్ణాతులైన వివిధ రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యులు ప్రజలకు సేవలు అందిస్తున్నారని, నంద్యాల వైద్య కేంద్రంగా మారిందని అన్నారు. నంద్యాల వైద్యులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ రాష్ట్రంలో ఆదర్శప్రాయంగా నిలిచారని అభినందించారు.
డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ నంద్యాలలో డాక్టర్ విజయ భాస్కర్ రెడ్డి కంటి అద్దాలు లేని చికిత్స కోసం కేంద్రం ప్రారంభించడం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. నంద్యాల ప్రజలు ఇప్పుడు అన్ని చికిత్సలు నంద్యాలలోనే అందుకుంటున్నారని, కర్నూలు, హైదరాబాదు లకు పోవడం బాగా తగ్గిపోయిందని అన్నారు. నంద్యాల వైద్యులు వ్యక్తిగతంగా, ఐఎంఏ ద్వారా వైద్య శిబిరాలు, సేవా కార్యక్రమాలు సుదీర్ఘ కాలంగా నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఫరూక్ తో పాటు, నంద్యాల జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ,రోటరీ మాజీ గవర్నర్ లు కల్లూరు రామలింగారెడ్డి, చిన్నపరెడ్డి, ఐఎంఏ నాయకులు డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదన రెడ్డి,డాక్టర్ అనిల్ కుమార్, ఐఎంఏ నంద్యాల కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ,డాక్టర్ లక్ష్మయ్య, డాక్టర్ సునీత, డాక్టర్ శైలజ, డాక్టర్ హరిత, డాక్టర్ అరిఫా భాను,అధిక సంఖ్యలో నంద్యాల వైద్యులు పాల్గొన్నారు.

# నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు కి అభినందనలు తెలిపిన జనసేన నాయకులు.



**ఆంధ్ర ప్రగతి ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:** నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షు పీఠని కైవసం చేసుకున్న జి.వి.ఎన్.ప్రసాద్ కు నంద్యాల జిల్లా జనసేన పార్టీ నాయకులు అభినందనలు తెలియజేశారు. మంచితనం, సహాయ గుణం, ఓపిక, నిజాయితీ కలిగిన వ్యక్తి సీనియర్ న్యాయవాది జి.వి.ఎన్.ప్రసాద్ అని కొనియాడిన జనసేన పార్టీ నాయకులు దండు మురళీ కృష్ణ. ఫోన్ కాల్ ద్వారా శుభాకాంక్షలు తెలిపిన జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు కొణిదెల సునీల్, మాజీ ఎం.ఎల్.ఏ నంద్యాల జిల్లా జనసేన పార్టీ పరిశీలకులు కిలారి వెంకట రోశయ్య. ఈ కార్యక్రమలో నంద్యాల నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మారాచు గురు బాబు, దినేష్, శ్రవణ్, న్యాయవాదులు చైతన్య, కిరణ్ కుమార్, ప్రకాష్, రమేష్, శ్రీశైలం నియోజకవర్గ నాయకులు హరి చంద్ర ప్రసాద్, దూదేకుల మురళీ, డమల్ చందు, జనసైనికుల తదితరులు పాల్గొన్నారు.

EDITOR.PRINTED,PUBLISHED AND OWENED BY CHINNA MATHANGI SREENIVASULU AND PRINTED AT:JRD PUBLICATIONS, # 11-107, ABBAS NAGAR, DISTRICT- KURNOOL,ANDHRA PRADESH- 518002 AND PUBLISHED FROM #24-100B, HARIJANAWADA, NANDYAL, ANDHRA PRADESH- 518501 RNI : APTEL/2023/89112, PHONE NO: 81211 33006, EMAIL ID : SREENIVAS.CM77@GMAIL.COM


# అంటరానితనంపై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు..

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్..!

**నేడే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి.**

**..నిమ్న వర్గాల అభ్యున్నతికి బాటలు వేసిన రాజ్యాంగ శిల్పి. సంఘసంస్కర్త, భారతరత్న అవార్డు గ్రహీత డాక్టర్ వి ఆర్. అంబేద్కర్.**

**..ఆరేళ్ల వయసుకే తల్లి మరణం చిన్న వయసులోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కు కుల వివక్ష గాయాలు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా ఏప్రిల్ 13:** డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ 1891 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తేదీన మహారాష్ట్ర రత్నగిరి జిల్లాకు చెందిన మహర్ కులంలో రాంజీ సక్పాల్, బీమాభాయ్ రామ్ జీ సక్పాల్ దంపతులకు ఆఖరి సంతానముగా జన్మించారు. ఆయన తండ్రి రాంజీ సక్పాల్ బ్రిటిష్ ఇండియా ఆర్మీలో సుబేదారుగా పనిచేసేవారు. భీమ్రావుకు రెండేళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన తండ్రి ఆర్మీ నుంచి పదవి విరమణ పొందారు. ఆయనకు ఆరేళ్ల వయస్సు ఉన్నప్పుడు తల్లి బీమాభాయ్ మరణించారు. సతారాలో పాఠశాల విద్య ప్రారంభమైంది. చిన్న వయస్సు లోనే తల్లి మరణించడంతో పినతల్లి ఆయన బాగోగులు చూసింది. ఆయన చిన్న వయస్సు లోనే కుల వివక్ష గాయాలతో అవమానపడ్డాడు. పాఠశాల విద్య కొనసాగుతుండగానే కుటుంబం బాంబేకు తరలి వెళ్లడంతో అంబేద్కర్ మిగతా పాఠశాల విద్య అంతటిని బాంబేలోపూర్తి చేశారు. అయితే, పాఠశాల విద్య కొనసాగినన్ని రోజులు తీవ్ర కుల వివక్షను ఎదుర్కొన్నారు. అంటరానితనముతో విసిగిపోయారు. ఆ తర్వాత వివిధ దేశాలలో ఉన్నత విద్యను అభ్యసించారు. అయితే చిన్న వయస్సులో ఆయన మనసుకు తగిలిన గాయాలు ఆయనను జీవితాంతం అంటరానితనాన్ని, సమాజంలో అసమానతలను, రూపుమాపేందుకు పోరాడేలా చేశాయి. పోరాటంలో ఆయన అనేక విజయాలు సాధించారు. చిన్న వయసులో అవమానాలతో భరించినా పెరిగి పెద్దవాడయ్యాక తన ప్రతిభను చాటుకుని సమాజంలోని ఒక మహోన్నత మూర్తిగా నిలిచారు. భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాకు చెందినవారు ఆకాలంలో అంటరాని వారిగా, వెనుకబడిన వారిగా, పరిగణించబడిన దళిత సామాజిక వర్గం. అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడి భారత రాజ్యాంగ నిర్మాతగా నిలిచారు. ఆయన జీవితాంతం కుల వ్యవస్థను వ్యతిరేకించారు తన జీవితంలో ఎదుర్కొన్న వివక్ష కారణంగానే కులరహిత సమాజం కోసం మరియు దళితుల సామాజిక, సమానత్వం కోసం నిరంతరం ఆయన కృషి చేశారు. ఇలాంటి అంటరానితనాన్ని తనలాగా ఈ దేశంలో ఎవ్వరూ ఎదుర్కోకూడదని, చిన్ననాటి నుండి తనను తాను రక్షించుకోవడమే కాకుండా, అంటరానితనాన్ని కూకటి వేళ్లతో సహా పెకిలించే ప్రయత్నం నిర్విరామంగా కృషి చేశారు. దేశంలో అందరూ సమానంగా జీవించడానికి ఆనందంగా ఆరోగ్యవంతంగా నివసించే వాతావరణంలో ఆయన ఏర్పరిచారు. అందుకే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను భారత రాజ్యాంగ జాతిపితగా యావత్తు ప్రపంచమానవాళి ఘనంగా కీర్తిస్తుంది. దళితులు మరియు వెనుకబడిన వర్గాల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడినారు ఆయన అంటరాంతానిపై సమరం చేశారు, ఉన్నత విద్యనభ్యసించి స్వతంత్ర భారతదేశపు మొదటి న్యాయశాఖ మంత్రిగా భారత రాజ్యాంగాన్ని గొప్పగా రూపొందించారు. అంటరాని కులాల అభ్యున్నతికి బాటలు వేశారు.

## డాక్టర్ బాబాసాహెబ్ మార్గదర్శకత్వంలో చివరి వరకు నడిచిన అనుయాయుడు "నానక్ చంద్ రత్తు"

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఢిల్లీలోని ఆలీపూర్ రోడ్డు లోని 26 నెంబరు బంగ్లాలో నివాసం ఉంటుండేవారు. బాబా సాహెబ్ తన చివరి రచన "బుద్ధ అండ్ హిస్ దమ్మ"అనే పుస్తకాన్ని రాస్తున్న రోజుల్లో ఆ సమయంలో ఒకరోజు రాత్రి భోజనం చేసిన తర్వాత ఎనిమిది గంటల సమయంలో తన వ్యక్తిగత రీడింగ్ రూములో కూర్చొని తన పుస్తకము రాయడంలో నిమగ్నమైపోయారు. అక్కడే ఉన్న బాబా సాహెబ్ అనుయాయుడు "నానక్ చంద్ రత్తు"ఆ రోజుకి ముఖ్యమైన పనులన్నీ పూర్తి చేసి డాక్టర్ బాబాసాహెబ్ టేబుల్ దగ్గరగా నిలబడి అనుమతి కోసం ఎదురు చూస్తున్నాడు. కాసేపటి తర్వాత బాబా సాహెబ్ రత్తుతో ఇక నువ్వు వెళ్లి పడుకొని పొద్దున్నే రమ్మని చెప్పారు. ఎప్పటిలాగే ప్రొద్దున 8 గంటల సమయంలో బాబాసాహెబ్ దగ్గరికి వచ్చిన నానక్ చంద్ రత్తూ రాత్రి వెళ్ళేటప్పుడు ఎలాగైతే పుస్తక రచనలో నిమగ్నమైన బాబాసాహెబ్ అప్పటికీ కూడా అలాగే కుర్చీలో కూర్చొని పుస్తకాన్ని రాస్తూనే ఉన్నారు. అంటే అప్పటికి 12 గంటలుగా పుస్తకము రాస్తూనే ఉన్నారు. ఆ సమయంలో నానక్ చంద్ రత్తూ నిశ్శబ్దంగా బాబా సాహెబ్ అంబేద్కర్ పక్కనే ఆయన వైపు చూస్తూ నిలబడిపోయాడు. అలా నిలబడి చాలా సమయం గడిచిపోయింది కానీ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూడను కూడా లేదు. తన పరిసరాలన్నీ కూడా గమనించలేనంతగా బాబాసాహెబ్ తన రచనలో నిమగ్నమైపోయారు. బాబా సాహెబ్ అంబేద్కర్ దృష్టి మరల్చడానికి నానక్ చంద్ రత్తూ టేబుల్ మీద ఉన్న పుస్తకాలన్నీ సర్దుతూ ఉండగా బాబా సాహెబ్ చూసి "రత్తూ"నువ్వు ఇంకా వెళ్లలేదా అనగానే కళ్ళల్లో నీళ్లు తిరుగుతుండగా బాబాసాహెబ్ కాళ్ళ దగ్గర కూర్చొని అయ్యా ఉదయం 8:30 గంటల సమయం అవుతుంది, గత 12 గంటలుగా రాస్తూనే ఉన్నారు... అసలు ఎందుకు ఇంతగా కష్టపడుతున్నారు అనడంతో డాక్టర్ బాబాసాహెబ్ "రత్తూ"... నా ప్రజలు ఇంకా వెనకబడే ఉన్నారు వారు ఏ దారిలో నడవాలో సొంతంగా నిర్ణయాలు తీసుకునే స్థితిలో కూడా లేరు. నేను చనిపోయిన తర్వాత నా పుస్తకాలే వారికి సరైన దిశా నిర్దేశం చేస్తాయి ప్రతి ఇంటికి నేను వెళ్లలేను కానీ నా సాహిత్యం మాత్రం వెళుతుంది. ఆ రచనలు చదివిన వారికి నా ఆలోచనలు అర్థం అవుతాయి. నా సిద్ధాంతం, నా ఆలోచనలు నా పుస్తకాల ద్వారానే తెలుసుకుంటారు. నా ఆలోచనలు సరైన పద్ధతిలో అర్థం చేసుకున్న ప్రజలు తమ కర్తవ్యం ఏంటో తెలుసుకొని పని చేస్తారు అందుకే నేనింత కష్టపడుతున్నాను. అంటూ రత్తూకు తెలియజేశాడు.

## సర్దార్ వల్లభాయ్ పటేల్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి మధ్య జరిగిన సంభాషణలో ఆసక్తికరమైన అంశాలు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మధ్య జరిగిన సంభాషణలో ఎన్నో ఆసక్తికరమైన అంశాలు చూసినట్లయితే అంబేద్కర్ను ఘోరంగా అవమానపరిచారు. అయితే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారికి సరైన సమాధానం చెప్పాడు. వారి మధ్య జరిగిన సంభాషణలో సర్దార్ వల్లభాయ్ పటేల్ అంబేద్కర్ గారితో మాట్లాడుతూ మిస్టర్ అంబేద్కర్ మీరు ప్రాతినిధ్యం వహించే చాలామంది ప్రజలు, మీ కులం ప్రజలు చొక్కా లేకుండా, నగ్నంగా జీవిస్తుంటే మీరు ఖరీదైన సూట్లు ధరిస్తారేంటి? మీరు యూరోపియన్ వలసవాదిగా కనిపిస్తున్నారు. గాంధీని చూడండి, అతను మీ వాళ్ళ లాగే చొక్కా లేకుండా బ్రతుకుతున్నాడు. ఆయనే మీ ప్రజలకు నిజమైన నాయకుడు అని అన్నాడు. అదే సందర్భంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మిస్టర్ పటేల్ నా ప్రజలు 2000 సంవత్సరాలుగా చొక్కా లేకుండా నగ్నంగానే జీవిస్తూ ఉన్నారు. వారిని మరో 1000 సంవత్సరాలు చొక్కా లేకుండా జీవించేలా మభ్యపెట్టి మోసం మేడం కోసమే గాంధీ మా వారిలా బతుకుతున్నట్లు నటిస్తున్నారు. నా ప్రజలు ఇక కష్టాలు పడటం నాకు ఇష్టం లేదు. నా ప్రజలు మంచి బట్టలు ధరించాలని, వీలైతే త్వరగా మంచి జీవితాన్ని గడపాలని నేను కోరుకుంటున్నాను,. అంటూ సర్దార్ వల్లభాయ్ పటేల్లకు ఘాటైన సమాధానం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇవ్వడం జరిగింది.

## భారత రాజ్యాంగాన్ని , డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కరే రాశారు.

భారతదేశంలో అనేకమంది కుహనా మేధావులు, మనువాదులు, కుట్రపూరితమైన ఆలోచన విధానంతో రాజ్యాంగం ఆయన ఒక్కడే రాయలేదని విమర్శిస్తుంటారు. అలాంటి వారికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ భారత రాజ్యాంగం రాయలేదు అనే వారికి అసలైన సమాధానం, స్వతంత్ర భారత రాజ్యాంగ ముసాయిదా రచన సంఘం 1947 వ సంవత్సరం ఆగస్టు 29న ఏర్పడిన రోజు అయితే మన దేశానికి రాజ్యాంగం వ్రాయడానికి ఏడుగురు సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఆఏడుగురిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్గా నియమించారు. మిగతా సభ్యులు 1,అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్, 2, కె.ఎం.మున్సి, 3 యన్. గోపాల్ స్వామి అయ్యంగార్ 4 మహమ్మద్ సాదుల్లా 5 ఎన్. మాధవి మీనన్, 6 డి.పి ఖైతాన్ ఈయన మరణముతో ఆయన స్థానంలో టిటి కృష్ణమాచారి వచ్చారు. అయితే రాజ్యాంగ రచన పూర్తి భారం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మీదనే పడింది. ఎందుకంటే మొదటగా ఈ అంశాన్ని పరిశీలించినట్లయితే ఈ కమిటీలో టి .టి కృష్ణమాచారికి నేశాసనంలో ప్రావీణ్యం లేదు. అలాగే పట్టభద్రుడు కూడా కాదు. అదేవిధంగా రెండో అంశం చూసినట్లయితే ఇద్దరు సభ్యులు ఇతర దేశాల కార్యకలాపాలలో మునిగిపోయారు. ఇంకొకరు అనారోగ్య కారణాలవల్ల మిగతావారు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు అలాగే ఇంకొక కారణం కూడా తోడైంది వారందరూ ఢిల్లీకి చాలా దూరం ఉండటం వల్ల కూడా వారు రాజ్యాంగ రచనల్లో పాల్గొనలేక పోవడం జరిగింది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక్కరి మీదనే భారం పడడం వల్ల ఆయన అనారోగ్యంతో బాధపడుతూనే ఆయన తప్ప చెప్పిన బాధ్యతను పూర్తిచేసి 1949 వ సంవత్సరం నవంబర్ 26 వ తేదీన అప్పటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ రాజ్యాంగ ప్రతిని అందజేయడం జరిగింది. వారు ఆ రాజ్యాంగ ప్రతిని అదే రోజు ఆమోదించడం జరిగింది ఈ రాజ్యాంగాన్ని జనవరి 26,1951 సంవత్సరం నుండి అమలు చేశారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ సభకే వెళ్లకుండా కుట్రలో దాగి ఉన్న చరిత్ర.

మన దేశానికి స్వాతంత్రం వచ్చిన సమయంలో పాలన వ్యవస్థ నిర్మాణం కానీ అతి క్లిష్టమైన వాతావరణం లో మన భారత రాజ్యాంగ రచన చేయడం జరిగింది. దీనికి రచనా కమిటీ చైర్మన్ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అయితే అంతకంటే ముందు ఆయనను అసలు రాజ్యాంగ సభకే వెళ్లకుండా అడ్డుకోవడానికి అనేక ప్రయత్నాలు చేశారు. అప్పుడున్న కొన్ని పార్టీలు కుట్రలో దాగి ఉన్న చరిత్రను కూడా చూడాలి లేకపోతే మనం మేల్కొనలేం. ఎందుకంటే అప్పుడు ఎన్నో ఒడిదుడుకులను ఓపిగ్గా ఎదుర్కొని బెంగాల్ రాష్ట్రం నుండి రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్గా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నికయ్యారు. తన సొంత రాష్ట్రమైన మహారాష్ట్ర నుంచి ఆయన్ను ఓడిపోయేలా చేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ను రాజ్యాంగ రచన కమిటీలో లేకుండా చేయాలనుకున్నారు. అప్పటి కాంగ్రెస్ నాయకులు హిందూ మహాసభ వారు, అయితే బెంగాల్ శాసనసభ ఎస్సీ ఫెడరేషన్, ముస్లిం లీగ్ సభ్యులు కలిసి డాక్టర్ అంబేద్కర్ గారిని తమ రాష్ట్రం నుండి ఎన్నికఅయ్యేలా చూసి బాబాసాహెబ్ కు రాజ్యాంగ రచన కమిటీలో స్థానం దక్కేలా చేశారు. అయితే ఆపై జరిగిన ఎన్నో పరిణామాలు దేశ విభజనను తెచ్చాయి. ఆ విభజన వల్ల డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎన్నికైన బెంగాల్ స్థానం తూర్పు పాకిస్థాన్లోకి వెళ్లిపోయేసరికి, ఆయన మరోసారి తన సభ్యత్వం కోల్పోవాల్సి వచ్చింది. అలా ఈ ప్రాంతం పాకిస్తాన్లోకి వెళ్లిపోవడం వెనుక కూడా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ను రాజ్యాంగ రచన కమిటీలో లేకుండా చేయాలనే కాంగ్రెస్ నాయకుల కుట్ర ఉంది. ఈ అన్యాయాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బ్రిటిష్ ప్రధానికి, ప్రతిపక్ష నాయకులకు విన్నవించగా ఈ తప్పిదాన్ని సరిచేసి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ను మరో ప్రాంతం నుంచి ఆయన ఎన్నుకోవాల్సిందిగా ప్రధాని నెహ్రూను ఆదేశించేసరికి పూణే నుంచి ఎన్నుకోవాలనుకున్న మాల్వాంకరును తప్పించి డాక్టర్ అంబేద్కర్ను ఎన్నుకోవడం జరిగింది. ఇలా కాంగ్రెస్ నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ కలిసి పడిన కుట్రను సమర్థంగా ఎదుర్కొని అంబేద్కర్ రాజ్యాంగ రచన కమిటీలో చోటు సంపాదించుకున్నారు. కానీ డాక్టర్ అంబేద్కర్ను రాజ్యాంగ పరిషత్తుకు రానివ్వకుండా చేయడానికి ఆయన గెలిచిన తూర్పు బెంగాల్లో ఒక ప్రాంతాన్నే పాకిస్తానికి ఇచ్చేశారా? దేశ భూభాగాన్ని కోల్పోవడానికి ప్రధాన కారకులు దేశద్రోహులు ఎవరు? కాన్స్టిట్యూషన్ అసెంబ్లీ డిబేట్స్ బుక్ నెంబర్ వన్ లో డాక్టర్ అంబేద్కర్ పేరు బెంగాల్ ప్రావిన్స్ లో ఉండగా బుక్కు నంబర్ 2 కి వచ్చేసరికి బొంబాయి ప్రావిన్స్ లోకి ఎందుకు మారిపోయింది? భారత రాజ్యాంగం గురించి మాట్లాడుకునే ముందు మనం తప్పనిసరిగా రాజ్యాంగాన్ని రూపొందించే బాధ్యతలు తీసుకున్న రాజ్యాంగ పరిషత్తుకు సభ్యులను ఎలా ఎన్నుకున్నారు? ఆ ఎన్నిక విధానం ఎలా జరిగిందో మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. అంతేకాకుండా ఆ రాజ్యాంగ పరిషత్తులో డాక్టర్ అంబేద్కర్ సభ్యుడు ఎలా అయ్యారు? దానికి ఆయన పడ్డ కష్టాలను మనం తప్పక తెలుసుకోవాలి. ఎందుకంటే రాజ్యాంగ పరిషత్తుకు 1946 వ సంవత్సరంలో జూలై, ఆగస్టులలో ఎన్నికలు జరిగాయి. అప్పుడు భారతదేశంలో బ్రిటిష్ సంస్థానాలు, స్వదేశీ సంస్థానాలు అనే రెండు పరిపాలన విభాగాలు ఉండేవి. ప్రతి సంస్థానం నుంచి సుమారు పది లక్షల జనాభాకు ఒక సభ్యుడు చొప్పున రాజ్యాంగ పరిషత్తుకు తీసుకున్నారు. మొత్తం 389 మంది సభ్యులకు గాను 296 మంది బ్రిటిష్ సంస్థానాల నుంచి ఎన్నుకోబడ్డారు. స్వదేశీ సంస్థానాల నుంచి 93 మంది ప్రాతినిధ్యం వహించారు. అయితే బ్రిటిష్ సంస్థానాలలో రాజ్యాంగ పరిషత్తుకు జరిగిన ఎన్నికలలో షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ నుండి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ఓడించడానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ కుట్ర పని అప్పటి బొంబాయి సంస్థాన ప్రధానమంత్రి అయిన బి.జీ కేర్ కు సూచనలు చేసి ఆయనను ఓడించడం జరిగింది. ఈ కుట్రలో వామపక్షాలు కూడా సర్దార్ వల్లభాయ్ పటేల్ తో చేతులు కలపడం చాలా శోచనీయం. సర్దార్ పటేల్ చేసిన ఈ కుట్రను గమనించిన బెంగాల్ లోని నామసూద్రుల నాయకుడైన మహాప్రసేన్, జోగేంద్రనాథ్ మండల్, జెస్సోర్ ఖుల్న్ నుంచి పోటీచేసిన తమ అభ్యర్థి అయిన "ముక్కుంద్ బిహారి మల్లిక"తో రాజీనామా చేయించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేత పోటీ చేయించడం జరిగింది. ఐక్య బెంగాల్ నుంచి పోటీ చేసిన డాక్టర్ అంబేద్కర్ గెలిచి రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికయ్యారు. అయితే ఈ ఎన్నికల్లో షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్కు బెంగాల్ లెజిస్లేచర్లో పూర్తి మెజార్టీ లేకపోవడంతో కావలసిన నాలుగు బదిలీ ఓట్లను ఆంగ్లో ఇండియన్, స్వతంత్ర దళిత, ముస్లింలీగ్ అభ్యర్థుల మద్దతుతో ఐదు ఓట్లు సాధించి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్తుకు ఎన్నికకాబడ్డారు. అయినప్పటికీ ,అయినా కూడా కాంగ్రెస్ లో ఉన్న ఉన్న కొంత మందికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గిట్టలేదు. అందుకే దేశ విభజన సమయంలో డాక్టర్ అంబేద్కర్ ఎన్నుకోబడ్డ తూర్పు బెంగాల్ ప్రాంతమైన జెస్సోర్ ఖుల్నాను విభజనలో భాగంగా పాకిస్తాన్ కు ఇవ్వడం జరిగింది.



## డాక్టర్ భీమ్రావు అంబేద్కర్ మరణానికి ముందు బౌద్ధమతం స్వీకరణ

భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కొన్ని రోజుల ముందు 1956 సంవత్సరంలో అక్టోబర్ 14 వ తేదీన నాగపూర్ లో 5 లక్షల మంది పైబడి అనుచరులతో కలిసి బౌద్ధ మతాన్ని స్వీకరించారు. హిందూ మతంలో జన్మించిన అంబేద్కర్ వ్యతిరేకంగా మతం మారాలన్న నిర్ణయం తీసుకున్న తర్వాత బౌద్ధ మతాన్ని స్వీకరించడానికి 20 సంవత్సరాలు పట్టింది. హిందూమతంలోని ఉన్న వ్యవస్థ, అంటరానితనాన్ని నిరసిస్తూ, సమానత్వం, స్వేచ్ఛ, మానవతావాదం ఉన్న బౌద్ధాన్ని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఎంచుకున్నారు. ఈచారిత్రాత్మక మార్పును దళిత బౌద్ధ ఉద్యమంగా నేడు పిలుస్తున్నారు దీనిని భీమ్రావు బాబాసాహెబ్ అంబేద్కర్ నవయాన అని పిలిచారు. 1935 వ సంవత్సరంలో నాసిక్ లోని యోలా లో జరిగిన సమావేశంలో నేను "హిందువుగా పుట్టాను కానీ నేను హిందువుగా చావను" డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రకటించారు. దళితులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వెంట బౌద్ధమతంలోకి మారారు. అందరినీ సమానంగా చూసిన ఏకైక మతం బౌద్ధమే కావడంతో ఆయన ఆనిర్ణయం తీసుకున్నారు. అయితే, జీవితాంతం విశ్రాంతి లేకుండా దేశం కోసం ,దేశ ప్రజల కోసం, సేవ చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1956 వ సంవత్సరం డిసెంబర్ 6 న నిద్రలోనే కన్నుమూశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పుట్టినరోజు పురస్కరించుకొని ప్రతి ఏడాది ఏప్రిల్ 14 ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. దేశంలోనే గాక ఇతర దేశాల్లో కూడా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు జరుగుతున్నాయి. పుష్పాంజలి ఘటించడం, క్యాండిల్స్ వెలిగించడం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆమహనీయుడికి జనం నివాళులు అర్పిస్తారు. ఈదేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ,బహుజనులందరూ ఆయన బాటలో నడుస్తూ ఆయన ఆశయాలను నెరవేరుస్తారని కోరుకుందాం



**డా.జి .బాలస్వామి**
న్యాయవాది మరియు ఫ్రీలాన్స్ జర్నలిస్టు
వ్యవస్థాపక అధ్యక్షుడు
- పూలే అంబేద్కర్ జ్ఞాన కేంద్రం

### రాష్ట్రస్థాయి ఎస్ ఏ ఏ పి లీగ్ లో బాల అకాడమీ

# బాలికల ప్రతిభకు సిల్వర్ కిరీటం.

**వేదిక ఏదైనా పోటీ ఏదైనా అద్భుత ప్రదర్శనతో ముందుండే బాల అకాడమీ.**

**-సంచలనాత్మకమైనటువంటి విజయాన్ని సాధించింది.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:** రాష్ట్రస్థాయి ఎస్ ఏ ఏ పి లీగ్ 2026 జల క్రీడా పోటీ విజయవాడలో 12-4-2026 న నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో 250 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల అకాడమీ బాలికలు అసాధారణ ప్రతిభ ను చాటుతూ ఈ పోటీలో సిల్వర్ మెడల్ సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. కఠినమైన పోటీ వాతావరణం లో ధైర్యం పట్టుదలతో పోరాడి ఈ విజయాన్ని అందుకోవడం ప్రత్యేకంగా నిలిచింది. ఈ పోటీలో బాల అకాడమీ సిల్వర్ ఓక్స్ లో 8వ తరగతి చదువుతున్న మనోజ్ఞ, షణ్ముఖ ప్రియా, ఆఫ్రా, ముస్కాన్, జొహ్రాఖాన్, సత్య వైష్ణవి ,శ్రీవిద్య విద్యార్థులు పాల్గొని అసాధారణ ప్రతిభ కనబరిచి నంద్యాల జిల్లాకి మంచి పేరు తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా బాల అకాడమీ పాఠశాల ప్రిన్సిపల్ మేడం మాధవి లత, కరస్పాండెంట్ ఎం. జీ రవీంద్రనాథ్ మాట్లాడుతూ'..మా విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ గెలుచుకోవడం ఎంతో గర్వకారణం అని ఈ గెలుపుకు సహకరించిన కోచ్ శివ కృషి మార్గదర్శకత్వం మరియు విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఇవన్నీ విద్యార్థుల గెలుపుకు మూల కారణమని ప్రశంసించారు.

# పి ఏ వి గ్రూప్ లో బోనస్ ల పండుగ

**..పి ఏ వి గ్రూప్ నూతన కార్యాలయ ప్రారంభం పురస్కరించుకొని సిబ్బందికి నగదు బహుమతి తో పురస్కారం.**

**11 లక్షల ఇరవై వేల రూపాయలను కానుకగా అందించిన పిఏవి గ్రూప్ చైర్మన్ పబ్బతి వేణుగోపాల్.**

**..పట్టణంలో కరోనా మహమ్మారి సేవల అనంతరం మరోసారి ఉదారత చాటుకున్న పబ్బతి వేణుగోపాల్.**

**..పిఏవి గ్రూప్ సిబ్బంది అహర్నిశలు కష్టపడడంతోనే అభివృద్ధి సాధ్యమైంది. పబ్బతి వేణుగోపాల్.**

**పీఏ వి గ్రూపు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించేలా కష్టపడతాం.-బిపి ఏ వి గ్రూప్ సిబ్బంది.**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
నంద్యాల పట్టణంలో కరోనా మహమ్మారి విజృంభన కష్టకాలంలో అందరికన్నా ముందుగా స్పందించి ఎంతోమందికి భోజనాలు పంపిణీ చేసి ప్రముఖ ఆర్యవైశ్య నాయకులు పి ఫోర్ కమిటీ మెంబర్ పిఏవి గ్రూపు చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ పట్టణంలో పలువురికి ఆదర్శంగా నిలిచారు సోమవారం పి ఏ వి గ్రూప్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సిబ్బందికి లక్షల రూపాయల బోనస్ లు ఇచ్చి మరోసారి తన ఉదారతను చాటుకున్నారు తన వద్ద పి ఏ వి గ్రూపులో పనిచేస్తున్న సిబ్బందికి వారి వారి సీనియార్టీలను బట్టి రూ లక్ష రూపాయల ను ఒక్కొక్కరికి బోనస్ గా అందజేశారు 20 మంది ఆఫీస్ సిబ్బందికి పిఏవి గ్రూపు నూతన కార్యాలయంలోయు సోమవారం రాత్రి 8 గంటలకు జరిగిన కార్యక్రమంలో సిబ్బందికి ఒక్కొక్కరికి శాలువా కప్పి మెమొంటో ,బోనస్ చెక్కు లను ఇచ్చి సత్కరించారు అనంతరం చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ మాట్లాడుతూ పి ఏ వి గ్రూప్ అభివృద్ధిలో సిబ్బంది అహర్నిశలు కష్టపడి భాగమయ్యారన్నారు. పి ఏవి గ్రూపులో తన వాటాగా వచ్చిన దానిలో కొంత భాగం 11 లక్షల ఇరవై వేల రూపాయలను సీనియార్టీ ప్రకారం



లక్ష రూపాయలకు తక్కువ కాకుండా అందరికీ పంపిణీ చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు దినదినాభివృద్ధి చెందుతున్న పిఏవి గ్రూప్ భవిష్యత్తులో కూడా లాభాలలో సిబ్బందికి బోనసులను అందించడం జరుగుతుందని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. పి ఏ వి గ్రూప్ సిబ్బంది మాట్లాడుతూ ఎంతోమంది యజమానులు ఎంత కష్టపడినా జీతంతోనే సరిపెడుతూ ఇంకా పని చేయాలని ఒత్తిడికి గురి చేస్తూ ఉంటారు కానీ పి ఏ వి గ్రూప్ యాజమాన్యం చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ ఎప్పుడూ కూడా ఒత్తిడికి గురి చేయరు టార్గెట్ల పేరుతో వేధించడం జరగలేదు అంతేకాకుండా లక్షల రూపాయలను బోనస్ గా ఇచ్చి మమ్మల్ని మరింత కష్టపడేలా ప్రోత్సహిస్తున్నారు. ఇకపై మేమంతా పీఏ వి గ్రూప్ మరిన్ని ఉన్నత శిఖరాలు చేరుకునేలా మరింత కృషి చేస్తామని చైర్మన్ పబ్బతి వేణుగోపాల్ కి ధన్యవాదాలు తెలిపారు.

## నంద్యాలలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు

# రంగం సిద్ధం..!

**..మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు పూర్తి.**

**..20 ఏళ్ల పోరాటానికి ఫలితం మంత్రి ఫరూక్ చొరవతో పట్టణ కేంద్రంలో ప్రతిష్టాపన.**

**..అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఆవిష్కరణ.**

**..మంత్రి ఫరూక్ చేతుల మీదుగా కార్యక్రమం.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా నంద్యాల పట్టణంలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.పట్టణ కేంద్రంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న దళిత సంఘాల రెండు దశాబ్దాల డిమాండ్ నెరవేరింది. రాష్ట్ర న్యాయ,మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్ చొరవతో నంద్యాల మున్సిపల్ కార్యాలయ ఆవరణలో విగ్రహాన్ని ప్రతిష్టించారు.ఇందుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయించారు.

నంద్యాల మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.వేదిక నిర్మాణం,అలంకరణ,భద్రతా చర్యలు,ప్రజల రాకపోకలకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

అంబేద్కర్ జయంతి సందర్భంగా రేపు ఉదయం 10 గంటలకు మంత్రి ఫరూక్ చేతుల మీదుగా విగ్రహాన్ని ఘనంగాఆవిష్కరించనున్నారుకార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

గతంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఈ అంశాన్ని నిర్లక్ష్యం చేసిందన్న విమర్శల నడుమ,ప్రస్తుత ప్రభుత్వం చర్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.దళిత వర్గాల ఆకాంక్షలకు ప్రాధాన్యం ఇచ్చిన నిర్ణయంగా విశ్లేషిస్తున్నారు.

పట్టణ శివార్లకు పరిమితమైన రాజ్యాంగ ప్రధాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పట్టణ కేంద్రంలో ప్రతిష్టించడం ప్రత్యేకతగా నిలిచింది.దీనికి సహకరించిన రాష్ట్ర మంత్రి ఫరూక్ కు,అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతూ దళిత,ప్రజా సంఘాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

## రాష్ట్ర న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ని మర్యాదపూర్వకంగా కలిసిన నంద్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
నంద్యాల బార్ అసోసియేషన్ ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ని మరియు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారిని వారి నంద్యాల క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది గోపిశెట్టి వెంకట నాగ ప్రసాద్ ( జివిఎన్ ప్రసాద్) మరియు వారి బృందానికి మంత్రి ఫరూక్ శుభాకాంక్షలు తెలియజేశారు. న్యాయవాదుల సంక్షేమానికి మరియు బార్ అసోసియేషన్ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు . సమాజంలో న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకమైనదని . సామాన్యులకు న్యాయం చేకూర్చడంలో మీరు నిరంతరం కృషి చేయాలన్నారు. న్యాయవాదుల సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ఉందని . నంద్యాల న్యాయవాదుల సంఘానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, కోర్టు ప్రాంగణంలో సమస్యల పరిష్కారం మరియు న్యాయవాదుల భవన నిర్మాణాలకు సంబంధించి నా వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు . న్యాయవ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు న్యాయవాదులు అండగా ఉండాలని మంత్రి ఫరూక్ కోరారు.ఈ కార్యక్రమంలో నంద్యాల నూతన బార్ అసోసియేషన్ అధ్యక్షులు జివిఎన్ ప్రసాద్ ప్రసాద్, జనరల్ సెక్రటరీ కె. గౌరీ శంకర్, స్పోర్ట్స్ సెక్రటరీ పుసులూరు ప్రసాద రెడ్డి, లేడీ రిప్రజెంటేటివ్ శ్రీదేవి , ఏపీపీ రాజేశ్వర రెడ్డి, సీనియర్ న్యాయవాది జి. జయకృష్ణ, ఎస్ఐ ఖలీల్ , అరిగెల రఘు ప్రకాష్ మరియు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## నంద్యాలలో ఘనంగా

# 'ప్రధానమంత్రి సూర్యఘర్ ఉత్సవ్'

**..ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.**

**ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత సోలార్ విద్యుత్ సౌకర్యం.**





**ఆంధ్ర ప్రగతి నంద్యాల, ఏప్రిల్ 13:**
నంద్యాల పట్టణంలోని 19వ వార్డు పొన్నాపురం కాలనీ (బసవతారక నగర్) నందు ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఏపీఎన్.పిడిసిఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన "ప్రధానమంత్రి సూర్యఘర్ ఉత్సవ్" కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పేద కుటుంబాల విద్యుత్ కష్టాలను తీర్చి, వారికి ఆర్థికంగా వెసులుబాటు కల్పించేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఈ పథకం కింద ఎంపిక చేయబడిన ఎస్సి మరియు ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని కల్పిస్తున్నామన్నారు. సుమారు 6 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో నంద్యాల నియోజకవర్గంలోని 500 మంది ఎస్సి , ఎస్టీ లబ్ధిదారులకు ఈ ప్రయోజనం చేకూరుతుందన్నారు. పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందని మంత్రి ఫరూక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, 19 వార్డ్ టీడీపీ ఇంచార్జి షేక్ మొహమ్మద్ రఫీ (మున్నా), నీటి సంఘాల చైర్మన్ చాబోలు ఇలియాస్, ఇమ్మానియేల్, విద్యుత్ శాఖ ఎస్సీ సుధాకర్ రావు, డి ఈ, ఈ మరియు ఉన్నతాధికారులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

## నీటి ఆవశ్యకత పై రాయలసీమ సాగునీటి సాధన సమితి మరో ముందడుగు.

**"జననీ జన్మభూమిశ్చ" గేయాన్ని ఆవిష్కరించిన విద్యార్థులు.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల ఏప్రిల్ 13:**
సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి తదితర అంశాలపై గత పదమూడేళ్ళుగా అనేక కార్యక్రమాలు చేపట్టిన రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రజలలో మరింత చైతన్యం తీసుకురావడానికి సాహిత్య రూపంలో గేయాలను విడుదల చేస్తోంది. అందులో భాగంగా విద్యార్థులు, యువతతో " జల ఆవశ్యకత - జల సంరక్షణ " అంశంపై సమితి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.
ఆదివారం నంద్యాల పట్టణంలోని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక వారు తమ కార్యాలయంలో విద్యార్థులు, యువతతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి విద్యార్థులతో మమేకమై "జలమే జీవం.. జలమే సంపద జలమే బలం.. జలమే సర్వస్వం..!" అని వివరిస్తూ సకల జీవరాసులకు నీటి ప్రాధాన్యత గురించి వివరించారు. ఏ ప్రాంతమైనా సమగ్ర అభివృద్ధి జరగాలంటే త్రాగు, సాగునీరు ముఖ్యమనీ..రాయలసీమకు అన్ని వనరులు వున్నప్పటికీ ఇంకా అభివృద్ధికి నోచుకోకపోవడం ఆవేదన కలిగిస్తోందనీ ఈ నేపథ్యంలో మన హక్కుల గురించి యువత లో చైతన్యం వచ్చి సాధించుకున్నప్పుడే మన జన్మభూమి అభివృద్ధి జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా సమితి రూపొందించిన "జననీ జన్మభూమిశ్చ" గేయాన్ని విద్యార్థులతో ఘనంగా ఆవిష్కరించడం జరిగింది.